


కృతజ్ఞత సభలో మాట్లాడుతున్న మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

బండ్ల చేరిక ఖాయమే..!

- త్వరలో అధికారిక ప్రకటన చేయనున్న గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి
- ఇప్పటికే కార్యకర్తలతో సమాలోచనలు పూర్తి
- కాంగ్రెస్‌లో చేరాలని ఒత్తిళ్లు
- వ్యతిరేకిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ సరిత వర్గం
- మండలాల్లో ధర్నాలు, సెల్‌టవర్ ఎక్కి.. పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నాలు
- గతంలోనే షరతు విధించిన ఎమ్మెల్యే బండ్ల
- భవిష్యత్‌పై సరిత మల్లగుల్లాలు


ఎంపీపీలు, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల సన్మాన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి


గద్వాలలో సెల్‌టవర్ ఎక్కిన కాంగ్రెస్ కార్యకర్త

మహబూబ్‌నగర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గద్వాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరడం ఖరారైపోయిందా? రెండు మూడు రోజుల్లో అధికారిక ప్రకటన వెలువడి.. పార్టీలో చేరుతారా? ఆ నేపథ్యంలో జడ్పీ చైర్‌పర్సన్ సరిత వర్గం నేతలు, కార్యకర్తలు ధర్నాలు, రాస్తారోకోలు, ఆత్మహత్యాయత్నాలు చేస్తున్నారా? గతంలో ఎమ్మెల్యే విధించిన షరతుపై క్లారిటీ తీసుకున్నారా? ఆయన చేరిక ఖరారు కానున్న నేపథ్యంలో సరిత భవిష్యత్‌పై మల్లగుల్లాలు పడుతున్నారా? అంటే తాజాగా జరుగుతున్న పరిస్థితులు అవుననే సమాధానం ఇస్తున్నాయి. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీచింది. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం కొలువుదీరింది. బీఆర్ఎస్ నేతలు బొటాబొటీ మెజారిటీతో ఉన్న ప్రభుత్వాన్ని కూలదోస్తామని చెబుతుండటంతో కాంగ్రెస్ పార్టీ ఆపరేషన్ ఆకర్ష్ చేపట్టింది. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ బలం 71 మందికి చేరగా.. ఇంకా కొంతమందితో చర్చలు జరుగుతున్నాయి. మొదటి నుంచి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డితో సత్సంబంధాలు ఉన్నాయి. రేవంత్‌రెడ్డి ఇండిపెండెంట్‌గా ఎమ్మెల్సీకి పోటీ చేసిన సమయంలో.. ఆయనకు బలం లేకున్నప్పటికీ.. కృష్ణమోహన్‌రెడ్డి మద్దతు తెలిపారనే ప్రచారం ఉంది. అలాగే టీడీపీలో కూడా కలిసి పనిచేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 12 స్థానాలు గెలుచుకోగా.. బీఆర్ఎస్ జోగుళాంబ గద్వాల జిల్లాలోని రెండు స్థానాలను తిరిగి కైవసం చేసుకుంది. రేవంత్‌రెడ్డి సీఎం అయిన వెంటనే మొదట కృష్ణమోహన్‌రెడ్డి పార్టీ మారతారనే ప్రచారం జరిగింది. ఆ మేరకు ఎమ్మెల్యేకు మంత్రి జూపల్లి కృష్ణారావు నుంచి పిలుపు కూడా వచ్చింది. సీఎం రేవంత్‌రెడ్డితోపాటు జూపల్లి కృష్ణారావుతో కూడా కృష్ణమోహన్‌రెడ్డికి సత్సంబంధాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం చేరికపై తుది నిర్ణయానికి వచ్చినట్లు స్పష్టమవుతోంది.

రెండుమూడు రోజుల్లో అధికారికంగా ప్రకటించి.. రేవంత్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరనున్నారు. ప్రస్తుతం ఈ విషయం గద్వాల జిల్లాలో హాట్‌టాపిక్‌గా మారింది. మొన్నటి ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని నిలబెట్టి.. గెలిపించిన బండ్ల.. ప్రస్తుతం పార్టీ మార్పు నిర్ణయం చాలామందిలో విస్మయం కలిగిస్తోంది. రెండువారాల క్రితం ఇలాంటి చర్చ జరిగినప్పటికీ.. ఎమ్మెల్యే ఆ ప్రచారాన్ని ఖండిస్తూ వచ్చారు. కానీ ఇప్పుడు దాదాపు చేరికపై స్పష్టత కనిపిస్తోంది.

తీవ్రంగా స్పందిస్తున్న సరిత వర్గం..

బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడం ఖాయమనే స్పష్టతకు వచ్చిన జడ్పీ చైర్‌పర్సన్ సరితవర్గం నాయకులు.. ఈ పరిణామాన్ని అడ్డుకోవడానికి తీవ్రంగా స్పందించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో రాస్తారోకోలు, ధర్నాలు చేశారు. గద్వాల పట్టణంలో ఓ యువకుడు సెల్‌టవర్ ఎక్కి.. కృష్ణమోహన్‌రెడ్డిని చేర్చుకోబోమని మంత్రి వచ్చి స్పష్టత ఇచ్చేవరకు కిందికి దిగేది లేదని బీష్మించుకున్నాడు. ఉదయం నుంచి ఎంత ప్రయత్నించినా దిగకపోవడంతో మధ్యాహ్నం రెండు గంటలకు పార్టీ ముఖ్యులు ఫోన్‌లో మాట్లాడటంతో కిందకు దిగాడు. అలాగే కేటీదొడ్డి మండలంలో ఒకరు, గద్వాల పట్టణంలో ఇద్దరు యువకులు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఎట్టి పరిస్థితుల్లో కృష్ణమోహన్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి రావొద్దని అల్టిమేటం జారీచేశారు. అలాగే గురువారం బీఆర్ఎస్ ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలకు ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించి.. సన్మానం చేయగా.. పేరుకు ఆ కార్యక్రమం అయినప్పటికీ.. పార్టీ మార్పుపై ప్రధాన చర్చ జరిగింద నేది స్పష్టమవుతోంది. ఇప్పటికే బుధవారం నియోజకవర్గ అభివృద్ధి కోసం కాంగ్రెస్‌లో చేరాలని బీఆర్ఎస్ నేతలు ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు.. మరోవైపు కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యే చేరికను అడ్డుకోవాల్సిందేనని సరితకు విన్నవించారు. గురువారం ఒక అడుగు ముందుకేసి.. నియోజకవర్గంలో గందరగోళం సృష్టించారు. అయితే చేరికపై స్పష్టత వస్తున్నప్పటికీ.. కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సరితను ఎక్కడ అడ్జస్ట్ చేస్తారు? ఏ దిశగా వారిని బుజ్జగిస్తారనే విషయంలో ఇంకా స్పష్టత రావడం లేదు.

షరతుపై క్లారిటీ వచ్చిందా...?

గడిచిన అసెంబ్లీ ఎన్నికల ముందు వరకు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత బీఆర్ఎస్‌లో ఉన్న వారే.. అలంపూర్, గద్వాల ఎమ్మెల్యే ఆమోదం మేరకు సరిత జడ్పీ చైర్‌పర్సన్ కాగా.. తర్వాత ఆమె అదే పార్టీ నుంచి గద్వాల ఎమ్మెల్యేగా పోటీ చేయాలని భావించడం.. ఆ దిశగా ప్రయత్నాలు చేస్తుండటంతో బండ్లకు సరితకు మధ్య విభేదాలు మొదలయ్యాయి. ఇక అప్పటి నుంచి తగువులు కనిపించేవి. ఎన్నికల ముంగిట కేసీఆర్ కృష్ణమోహన్‌రెడ్డి పేరునే ఖరారు చేయడంతో.. సరిత బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. అప్పటికీ నియోజకర్గంలో చుక్కాని లేని నావలా ఉన్న కాంగ్రెస్ పార్టీకి పెద్దదిక్కుగా మారారు. బీసీ మహిళ కావడంతో కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ ఇచ్చి ప్రోత్సహించింది. అయితే అనూహ్యంగా బీజేపీ నుంచి ప్రధాన ప్రత్యర్థి అవుతుందన్న డీకే అరుణ తప్పుకుని.. బోయ వాల్మీకి అభ్యర్థికి టిక్కెట్ ఇవ్వడంతో సరిత ఓటమిపాలయ్యారు. అయితే రెండు వారాల కిందటే అధిష్ఠానంతో చర్చలు పూర్తయినప్పటికీ.. తమ భవిష్యత్‌పై సరిత,తిరుపతయ్య సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని, మంత్రులను కలిశారు. జడ్పీ చైర్‌పర్సన్ పదవి తిరిగి ఇవ్వాలని, అలా అయితేనే పార్టీలో తన చేరికను ఆహ్వానిస్తామని తెలిపారు.

అదే సమయంలో మళ్లీ జడ్పీ చైర్‌పర్సన్ ఇస్తే.. విభేదాలు వస్తాయని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమెకు పదవి ఇవ్వకపోతేనే పార్టీలో చేరతానని ఎమ్మెల్యే షరతు విధించారు. ఇప్పుడు చేరిక ఖరారైందనుకున్న నేపథ్యంలో ఎలాంటి షరతులకు అంగీకరించారు? సరిత భవిష్యత్‌పై ఎలాంటి హామీ ఇవ్వబోతున్నారనే విషయంలో స్పష్టత రావడం లేదు.

కాంగ్రెస్ పార్టీ మతతత్వ రాజకీయాలు

- హిందువులను హింసావాదులుగా చిత్రీకరిస్తున్న రాహుల్‌గాంధీ
- మనోభావాలు దెబ్బతింటున్నాయనే అంశాన్ని క్షేత్ర స్థాయికి తీసుకెళ్లాలి
- పాలమూరు ఎంపీగా విజయోత్సవ సభలో డీకే అరుణ

మహబూబ్‌నగర్, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/మహబూబ్‌నగర్ (క్లాక్ టవర్)జూలై 4 : కాంగ్రెస్ పార్టీ హిందువులపై విషం కక్కుతోందని, వారి మనోభావాలను దెబ్బతీసే విధంగా రాహుల్ గాంధీ మాట్లాడుతున్నారని మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ, ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ఆరోపించారు. ఎంపీగా విజయం సాధించిన తర్వాత తొలిసారి పాలమూరుకు వచ్చిన ఆమె గురువారం మహబూబ్‌నగర్‌లో విజయోత్సవ సభ, భగీరథ కాలనీలోని ఓ ఫంక్షన్‌హాల్లో జరిగిన కృతజ్ఞత సభలో ఆమె మాట్లాడారు. అసలు విషయాలను పక్కనపెట్టి రాహుల్ గాంధీ మత రాజకీయాలకు పాల్పడుతున్నారని అన్నారు. హిందువులను హింసావాదులుగా కాంగ్రెస్ పార్టీ చిత్రీకరిస్తోందని, ఆ విషయాలను కార్యకర్తలు క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని సూచించారు. దేశంలో ఎమర్జెన్సీ విధించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని, బీజేపీ రిజర్వేషన్లు తీసేస్తుందని ఎన్నికల సమయంలోనూ అసత్యపు ప్రచారం చేసిన పార్టీ కూడా కాంగ్రెస్సేనని విమర్శించారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మద్దతు లేకుండా ఇక్కడ రాష్ట్ర ప్రభుత్వం కూడా పనిచేయలేదని, ఎన్నికలు అయిపోయాయి కాబట్టి కుట్రలు మానుకొని కలిసి రావాలని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను కోరారు. గత ఎన్నికల్లో సీఎం రేవంత్‌రెడ్డి తన ఓటమి కోసం ఎంతగానో పనిచేశారని, సీఎం నుంచి ఎమ్మెల్యేల వరకు ఎన్ని కుట్రలు చేసినా తన గెలుపును ఆపలేకపోయారని అన్నారు. తనతో పాటు కార్యకర్తలను వేధించారని అన్నారు. తన విజయం పాలమూరు ప్రజల విజయమని ఆమె అన్నారు. తన గెలుపు కోసం కృషి చేసిన ప్రతీ ఒక్కరి కి సిరస్సు వంచి నమస్కరిస్తున్నానని తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లా అభివృద్ధికి సీఎం రేవంత్‌కు ఎంత బాధ్యత ఉందో అంతే బాధ్యత తనకు ఉందని అన్నారు. కేంద్రం నిధులతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. గద్వాల అసెంబ్లీ నియోజకవర్గంలో బోయలు 60 వేల మంది ఉన్నారని, వారు రాజకీయంగా ఎదగాలని ఎమ్మెల్యే ఎన్నికల్లో బీజేపీ టికెట్ ఇప్పిస్తే కాంగ్రెస్ ద్వేషపూరిత రాజకీయాలతో ఓడించారని అన్నారు. జిల్లాలో భూతగాదాలు జరగకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ తీసుకోవాలని అన్నారు. అంతకు ముందు బీజేపీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని అప్పన్నపల్లిలో ఆమెను గజమాలతో స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి భగీరథ కాలనీ, అన్నపూర్ణ గార్డెన్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు టీ ఆచారి, రాష్ట్ర అధికార ప్రతినిధి కట్ట సుధాకర్ రెడ్డి, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యుడు నాగురావు నామాజీ, శ్రీవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండయ్య, ఎగ్గని నర్సిములు, పడాకుల బాలరాజు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.


సభకు హాజరైన నాయకులు, కార్యకర్తలు

పరుగులు పెట్టనున్న నల్లమల పర్యాటకం

- నేడు క్షేత్రస్థాయి పరిశీలనకు మంత్రి జూపల్లి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు
-పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు


నల్లమలలోని ఫరహాబాద్ ముఖద్వారం


నల్లమలలో ఏర్పాటు చేసిన దారి

అచ్చంపేట, జూలై 4: నల్లమల అందాలను తిలకించేందుకు మార్గం సుగమం కానున్నది. పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు నేడు, రేపు నల్లమలలో పర్యటించనున్నా రు. మంత్రి పర్యటనతో నల్లమల పర్యాటకం అభివృద్ధిలో పరుగులు పెట్టనున్నదనే ఆశాభావం ఈ ప్రాంత ప్రజల్లో చిగురిస్తున్నది. ఇప్పటికే నల్లమల అందాలను, అభయారణ్యంలోని చారిత్రక ఆలయాలను తిలకించేందుకు ప్రతినిత్యం పర్యాటకులు వస్తుంటారు. ఈ క్రమంలో నల్లమల ప్రాంతానికి చెందిన రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో అభివృద్ధిపై ప్రత్యేక చొరవ చూపిస్తారనే అభిప్రాయం స్థానికుల, పర్యాటకుల నుంచి వ్యక్తం అవుతున్నది. సోమశిల, ఉమామహేశ్వర క్షేత్రాలతో పాటు సలేశ్వరం, లొద్దిమల్లయ్య, మల్లెలతీర్థం, ఆక్టోపస్ వ్యూపాయింట్, అక్కమాదేవి గుహలను తిలకించేందుకు పర్యాటకులు తరలి వస్తుంటారు. జిల్లాలో 2,611 చదరపు కిలోమీటర్ల పొడవున నల్లమల విస్తరించి ఉండటం, 765 జాతీయ రహదారి 90 కిలో మీటర్ల మేర ఉండటంతో ప్రకృతి అందాలు చూసేందుకు వివిధ రాష్ట్రాల నుంచి పర్యాటకులు భారీ సంఖ్యలో తరలి వస్తుంటారు. అక్కమాదేవి గుహలతో పాటు ప్రతాపరుద్రుడి కోటను పర్యాటకంగా అభివృద్ధి చేస్తే ఈ ప్రాంతంలోని యువతకు ఉపాధి లభించే అవకాశాలున్నాయి. అతేకాకుండా పర్యాటక అభివృద్ధితో ప్రభుత్వానికి ఆదాయ వనరులు సమకురుతాయి. పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నల్లమలలో పర్యటించనుండటంతో ఈ ప్రాంతం పర్యాటకంగా పరుగులు పెడుతుందన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.

నల్లమల టూర్ షెడ్యూల్ ఇలా...

జూలై 5వ తేదీన ఉదయం ఎనిమిది గంటలకు ఉమామహేశ్వరుడి దర్శనం, 9:30 నుంచి 10:30 వరకు మన్ననూర్‌లోని ఈఈసీ ప్లాస్టిక్ రిసైక్లింగ్ సెంటర్, బయోల్యాబ్ సందర్శన తదనంతరం చింతల చెరువు వద్ద వనమహోత్సవ కార్యక్రమం. మధ్యాహ్నం రెండుగంటల వరకు వ్యూపాయింట్, కదళీవనం సందర్శన, మూడు గంటల వరకు బౌరాపూర్ ఆలయ దర్శనం, అక్కడి నుంచి బయలుదేరి 4:30 వరకు మల్లెలతీర్థం జలపాతం సందర్శన 4:30 గంటల నుంచి 5:30 వరకు వజ్రాల మడుగు, ఆక్టోపస్ వ్యూపాయింట్ సందర్శ నతో మొదటిరోజు పర్యటన ముగుస్తుంది. 6వ తేదీన ఉదయం ఏడు గంటలకు శ్రీశైలం మల్లిఖార్జున స్వామి దర్శనం, ఎనిమిది గంటల నుంచి 11వరకు అక్కమాంబ, రివర్ బోటింగ్, 11:30 నుంచి 2:30 మద్దిమడుగు ఆంజన్న దర్శనం, గీసుగండీ రివర్ పాయింట్, మూడు నుంచి 4:30 వరకు గున్నంపేట, రాయలగండి, అంతర్‌గంగా సందర్శన, 4:30 గంటల నుంచి ఐదు వరకు మన్ననూర్ జంగిల్ రిసార్ట్‌ను సందర్శిస్తారు. అనంతరం సమీపంలో స్థలాలను సాయంత్రం ఏడు గంటల వరకు సందర్శిస్తారు.


నల్లమలలోని కృష్ణానది బ్యాక్ వాటర్

వంద శాతం వసూలు కావాల్సిందే

- ఆస్తి పన్ను వసూలుపై మునిసిపాలిటీలకు సర్కార్ నిర్దేశం
- పేరుకున్న బకాయిలపై స్పెషల్ డ్రైవ్
- ప్రతీ మునిసిపాలిటీకి ఐదు ప్రత్యేక బృందాలు

నాగర్‌కర్నూల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీల్లో ఆస్తి పన్నుల వసూలుపై రాష్ట్ర సర్కార్ ప్రత్యేక దృష్టి సారించింది. మునిసిపాలిటీల ఆదాయాన్ని పట్టణాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. ఈ క్రమంలో జిల్లాలోని నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట, కల్వకుర్తి మునిసిపాలిటీల్లో 2021-22 ఆర్థిక సంవత్సరం నుంచి ఇప్పటి వరకు పేరుకుపోయిన బకాయిలపై మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రత్యేక నివేదిక తెప్పించుకుంది.

● ఆస్తి పన్ను వసూలులో నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ అగ్రగామి

ఆస్తి పన్ను వసూలులో జిల్లాలోనే నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ అగ్రగామిగా ఉంది. నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలోని 24వార్డుల పరిధిలో 10వేల 425 ఇళ్లు, 2031 వ్యాపార సముదాయాలకుగాను కోటీ 89లక్షల 46వేల రూపాయల ట్యాక్స్ డిమాండ్ ఉండగా కోటీ 62లక్షల 64వేల రూపాయల ఆస్తి పన్ను వసూలైంది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి గాను 3కోట్ల 56లక్షల 52వేలు వసూలు కావాల్సి ఉండగా 2కోట్ల 67లక్షల 39వేలు మునిసిపల్ ఖాతాలో జమయ్యాయి. ఎన్నికల ఏడాది కావడంతో రాజకీయ నాయకుల ఒత్తిడి కారణంగా మునిసిపల్ అధికారులు కూడా కచ్చితంగా ఆస్తి పన్ను వసూలు చేయలేకపోయారు. దీని కారణంగా ఆ ప్రభావం జిల్లాలోని మిగతా మునిసిపాలిటీలపై పడింది. కల్వకుర్తి మునిసిపా లిటీలో 22 వార్డుల్లో 6345నివాస గృహాలు, 1722 వ్యాపార సముదాయాలు ఉండగా 2021-22 ఆర్థిక సంవత్సరంలో 3 కోట్ల 9లక్షల 22వేల ఆస్తి పన్ను వసూలు కావాల్సి ఉండగా 2కోట్ల 20లక్షల 6వేలు మాత్రమే వసూలైంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్ను వసూలు మరింత పడిపో యింది. ఆ ఏడాది ట్యాక్స్ డిమాండ్ రూ. 5 కోట్ల 18లక్షల 45వేలు కాగా కేవలం రూ. 3 కోట్ల 14లక్షల 51వేలు మాత్రమే జమ అయ్యాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో డిమాండ్ రూ. 5 కోట్ల 21 లక్షల 73వేలు కాగా ఇప్పటి వర కు రూ. 3 కోట్ల 15 లక్షల 7వేలు వసూలయ్యాయి. ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి లక్ష్యాన్ని చేరుకోగలమనే ఆశా భావంలో మునిసిపల్ అధికారులు ఉన్నారు.

● వెనుకబడిన కొల్లాపూర్ మునిసిపాలిటీ

ఆస్తి పన్ను వసూలులో కొల్లాపూర్ మునిసిపాలిటీ వెనుకబడి ఉంది. మునిసిపాలిటీ పరిధిలో 6324 నివాస గృహాలు, 335 వ్యాపార సముదాయాలు ఉండగా 2021-22క ఆర్థిక సంవత్సరంలో ట్యాక్స్ డిమాండ్ రూ. 95లక్షల 80 వేలు కాగా 70లక్షల 22వేలు మాత్రమే వసూలయ్యాయి. 2022-23లో ఆస్తి పన్ను వసూలు ప్రక్రియ మరింత మందకొడిగా జరిగింది. రూ.కోటి 18లక్షలు ఆస్తి పన్ను డిమాండ్ కాగా కేవలం 74లక్షల 75వేలు మాత్రమే వసూలు చేయగలిగారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ట్యాక్స్ డిమాండ్ రూ.కోటీ 36లక్షల 5వేలు కాగా ఇ ప్పటి వరకు రూ. 85లక్షల 74 వేలు మాత్రమే వసూ లయ్యాయి.

● అచ్చంపేట మునిసిపాలిటీ పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా లేదు. అచ్చంపేట మునిసిపాలిటీలో మొత్తం వార్డుల సంఖ్య 20కాగా 6565 నివాస గృహాలు, 556 వ్యాపార సముదాయాలుండగా 2021-22 ఆర్థిక సంవత్సరంలో ట్యాక్స్ డిమాండ్ రూ.కోటీ 75లక్షల 83 వేలు కాగా రూ.కోటీ 7లక్షల 30వేలు మాత్రమే వసూలయ్యాయి. 2022-23ఆర్థిక సంవత్సరంలో రూ.కోటీ 78లక్షల 67వేలు ట్యాక్స్ డిమాండ్ ఉండగా రూ.కోటీ 39లక్షల 40 వేలు వసూలయ్యాయి. 2023-24 సంవత్సరంలో ట్యాక్స్ డిమాండ్ రూ.2కోట్ల 92వేలు ఉండగా రూ. కోటీ 61లక్షల 59వేలు మునిసిపల్ ఖాతాలో జమ అయ్యాయి.

● వంద శాతం వసూలు చేస్తాం



పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన కోసమే ప్రభుత్వం ఆస్తి పన్ను వసూలు చేస్తుంది. దీన్ని సకాలంలో చెల్లించి మునిసిపాలిటీల ద్వారా రావాల్సిన సదుపాయాలను పొందాలి. ఏదైనా అసౌకర్యం కలిగితే ఆస్తి పన్ను చెల్లించిన వ్యక్తులు మమ్మల్ని ప్రశ్నించే అధికారం ఉంటుంది. మునిసిపల్ సిబ్బంది కూడా అందుకు సహకరిస్తాం.

- నరేష్‌బాబు, మునిసిపల్ కమిషనర్, నాగర్‌కర్నూల్

పాడి పరిశ్రమపై ఆసక్తి


కల్వకుర్తి పాలశీతలీకరణ కేంద్రం


పాల కేంద్రంలో పాలు పోస్తున్న రైతు

- విజయ డెయిరీ పాల సేకరణలో రాష్ట్రంలోనే రెండో స్థానం
- జిల్లాలో కల్వకుర్తి, అచ్చంపేట పాల శీతలీకరణ కేంద్రాలు
- ఏడు బీఎంసీయూలు.. ప్రతీరోజు లక్షా 3 వేల లీటర్ల పాల సేకరణ

కల్వకుర్తి, జూలై 4: పాడి పరిశ్రమపై నాగర్‌కర్నూల్ జిల్లా రైతులు ఆసక్తి చూపుతున్నారు. వ్యవసాయానికి అనుబంధంగా పాడి పరిశ్రమను ఎంచుకొని లాభాల బాటలో ముందుకు సాగుతున్నారు. చిన్న, సన్నకారు రైతులు ఉన్న కొద్దిపాటి పెట్టుబడితో ఆవులు, గేదెలను పోషించుకుంటూ పాల దిగుబడులు పొందుతున్నారు. మరికొందరు రైతులు డెయిరీ ఫాంలను నెలకొల్పి పాల ఉత్పత్తి సాగిస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలో కల్వకుర్తి, అచ్చంపేట పాలశీతలీకరణ కేంద్రాలు ఉన్నాయి. కల్వకుర్తి పాలశీతలీకరణ కేంద్రం పరిధిలో కొండారెడ్డిపల్లి, వెల్దండ, కుప్పగండ్ల, మాధారం, ఊర్కొండపేట, గుండూరు, నాగర్‌కర్నూల్‌లో బల్క్ మిల్క్ కూలింగ్ కేంద్రాలు (బీఎంసీయూ) ఉన్నాయి. వీటి పరిధిలో ప్రతీరోజు లక్షా 3 వేల లీటర్ల పాల సేకరణ కొనసాగుతోంది. రాష్ట్రంలోనే రంగారెడ్డి జిల్లా లక్షా 10 వేల లీటర్ల పాల సేకరణ సాగిస్తూ మొదటి స్థానంలో ఉండగా, రెండో స్థానంలో నాగర్‌కర్నూల్ జిల్లా ఉన్నది.

విజయ డెయిరీతో రైతులకు మేలు..

ప్రైవేట్ డెయిరీలకు పాలు పోస్తే చెల్లించే ధర కంటే విజయ డెయిరీలో పోసే పాలకు ధర ఎక్కువ వస్తుంది. ఆవు పాలు లీటరుకు రూ.45 వరకు వస్తుండగా, గేదె పాలకు రూ.50 నుంచి రూ.80 వరకు వస్తోంది. దీంతో విజయ డెయిరీకి పాలు పోసేందుకు రైతులు ఆసక్తి చూపిస్తున్నారు.

ప్రోత్సాహకం అందితే మరింత మేలు..

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు లీటరుకు రూ.4 ప్రోత్సాహకాన్ని విడుదల చేస్తే మరింత మేలు కలుగుతోందని రైతులు అభిప్రాయపడుతున్నారు. 2020 ఏప్రిల్ నుంచి రూ.4 ప్రోత్సాహకం బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయి. దాదాపు రూ.20 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో జిల్లాలోని పది వేల మంది పాడి రైతులు ప్రోత్సాహకం కోసం ఎదురు చూస్తున్నారు. అదేవిధంగా విజయ డెయిరీకి పాలు పోసే రైతులకు 15 రోజులకు ఒకసారి పాల బిల్లు చెల్లిస్తేనే పశు, కుటుంబ పోషణకు ఇబ్బంది ఉండదని రైతులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించి పదిహేను రోజులకు ఒకసారి బిల్లులు చెల్లించాలని, దాణా, మినరల్ మిక్చర్ అందించాలని రైతులు కోరుతున్నారు.

లాభసాటిగానే ఉంది.



పశువుల పోషణ మంచిగా ఉంటే పాల దిగుబడి బాగా వస్తుంది. పాలను విజయ డెయిరీలో పోస్తున్నాను. వచ్చే పాల బిల్లుతో తన కుటుంబాన్ని పోషించుకుంటున్నా. పాడి పరిశ్రమ చిన్న, సన్నకారు రైతులకు ఎంతో ఉపయోగపడుతోంది. ప్రభుత్వం ప్రోత్సాహకం ఇస్తే బాగుంటుంది.

- శంకర్‌నాయక్, రైతు, రాంనగర్‌తండా

పాడి రైతులు అధైర్యపడొద్దు



పాడి రైతులు అధైర్య పడొద్దు. వ్యవసాయానికి అనుబంధంగా పాడి పరిశ్రమ లాభసాటిగానే ఉంటుంది. ప్రైవేట్ పాల సేకరణ కేంద్రంలో కంటే విజయ డెయిరీలోనే పాల ధర అధికంగా ఉంటుంది. రైతులకు పాల బిల్లుల చెల్లించే విషయంలో పైఅధికారులు ప్రణాళికబద్ధంగా ముందుకు సాగేందుకు చర్యలు తీసుకుంటున్నారు. బిల్లుల చెల్లింపులో జాప్యం జరగకుండా చూస్తాం.

- సత్యనారాయణయాదవ్, విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

» మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి అర్బన్, జూలై 4 : అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి మండిపడ్డారు. గురువారం వనపర్తి జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ పేరుతో కాలయాపన చేస్తు రైతుబంధు ఎగ్గొట్టేందుకు కుట్రలు చేస్తున్నదని మండిపడ్డారు. రాష్ట్రంలో పాలనను గాలికి వదిలేసి ఇతర పార్టీల నాయకులను పార్టీలో చేర్చుకునేందుకే సమయం కేటాయిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ లేదన్న ముఖ్యమంత్రి అదే పార్టీ నాయకుల ఇళ్లకు వెళ్లి ఎమ్మెల్యేలను ఎందుకు పార్టీలో చేర్చుకుంటున్నారని ప్రశ్నించారు. గతంలో కేసీఆర్ ఏనాడు కూడా ప్రతిపక్ష నాయకుల ఇళ్లకు వెళ్లి కండువాలు కప్పలేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజాప్రతినిధులు పనిచేసిన పెండింగ్ బిల్లులు కూడా ఇవ్వడం లేదని, వాటిపై న్యాయ వ్యవస్థ ద్వారానే పోరాటం చేస్తామన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే కాంగ్రెస్ పార్టీ ప్రజా విశ్వాసం కోల్పోయిందని, ప్రజా వ్యతిరేకత కూడా రోజురోజుకు పెరుగుతోందన్నారు. పార్టీని నమ్ముకుని ఉన్న నాయకులకు మంచి రోజులు రానున్నాయని, ఎవరు కూడా అధైర్యపడొద్దన్నారు. పదవీకాలం ముగిసిన ఎంపీ పీలు, జడ్పీటీసీ సభ్యులు, సర్పంచులు ప్రజల్లో ఉండి ప్రజాసేవ చేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు, పార్టీ జిల్లా నాయకులు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నిరంజన్‌రెడ్డి

బీడీ ఫ్యాక్టరీలను మూయించిన నాయకులు

» పెరిగిన కూలి ఇవ్వడానికి యజమాని ససేమిరా
» ఇచ్చేవరకు ఫ్యాక్టరీలో పని జరగనివ్వమన్న కార్మిక సంఘాలు

అమరచింత, జూలై 4 : వేతన ఒప్పందం ప్రకారం పెంచిన కూలి డబ్బులు ఇవ్వడానికి ఓ ఫ్యాక్టరీ యజమాని ఒప్పుకోకపోవడంతో కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ గురువారం ఆ యజమానికి సంబంధించిన రెండు ఫ్యాక్టరీలను మూయించారు. వనపర్తి జిల్లా అమరచింత పట్టణంలోని చందూరు బీడీ ఫ్యాక్టరీ, త్రీ నెంబర్ బీడీ ఫ్యాక్టరీలను కార్మిక సంఘం నాయకులు మూయించి, యజమాని తీరుపై నిరసన వ్యక్తం చేశారు. గత నెల మూడో తేదీన ఫ్యాక్టరీ యజమానులు, కార్మిక సంఘం నాయకుల మధ్య జరిగిన చర్చల్లో వెయ్యి బీడీలకు రూ.235 వేతన ఒప్పందం కుదిరింది. వేతన ఒప్పందాన్ని అన్ని ఫ్యాక్టరీలు అమలుపర్చగా ఓ ఫ్యాక్టరీ యజమాని మాత్రం ససేమిరా అంటున్నాడు. ఈనెలకు పాత పద్ధతిలో వెయ్యికి రూ.220 ఇవ్వడానికి ముందుకు రాగా కార్మిక సంఘం నాయకులు అడ్డుకున్నారు. గురువారం కార్మిక సంఘం నాయకులు పట్టణంలోని చందూరు బీడీ ఫ్యాక్టరీ, త్రీ నెంబర్ బీడీ ఫ్యాక్టరీలను మూయించారు. ఫ్యాక్టరీ యజమాని నూతన ఒప్పందం ప్రకారం కూలి డబ్బులు ఈనెల నుంచి ఇస్తేనే ఆయనకు సంబంధించిన ఫ్యాక్టరీలను తెరవాలని, లేకపోతే ఫ్యాక్టరీలో ఎలాంటి పని జరగనివ్వమని వామపక్ష బీడీ కార్మిక సంఘం నాయకులు ఎస్పీ.శ్యాంసుందర్, ఆర్ఎస్.రమేష్, సామెల్, బుచ్చన్నలు పేర్కొన్నారు.


బీడీ ఫ్యాక్టరీని మూయించి, నిరసన తెలుపుతున్న కార్మిక సంఘం నాయకులు

ఐదేళ్లు నీతివంతమైన పాలన చేశా

» జిల్లా పరిషత్ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి

వనపర్తి అర్బన్, జూలై 4 : జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఐదేళ్లు నీతివంతమైన పాలన చేశానని ఎక్కడా అవినీతికి పాల్పడలేదని జిల్లా పరిషత్ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలోని 33 జిల్లా పరిషత్‌లలో వనపర్తి జిల్లా పరిషత్‌కు అభివృద్ధి విషయంలో పేరు తీసుకువచ్చానని తెలిపారు. పాలకవర్గం సభ్యులు జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలతో కలిసి జిల్లా అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసినట్లు తెలిపారు. జిల్లాలోని 14 మండలాల సర్వసభ్య సమావేశాలకు హాజరై సమస్యలను తెలుసుకుని సభ్యులతో కలిసి పరిష్కరించినట్లు తెలిపారు. ఈ ఐదేళ్లలో జడ్పీ జనరల్ ఫండ్ 551 పనులకు రూ.11 కోట్ల 88 లక్షల 74 వేల 700 నిధులు వచ్చినట్లు తెలిపారు. ఈ నిధులు ప్రధానంగా పాఠశాలల్లో మరుగుదొడ్లు, వంట కిచెన్ షెడ్లకు, హెల్త్ సెంటర్స్, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నచిన్న మరమ్మతులతో పాటు ప్రధానంగా అవసరమయ్యే వాటికి ఉపయోగించినట్లు తెలిపారు. ఈ ఐదేళ్ల సహకరించిన అధికారులకు ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న లోక్‌నాథ్‌రెడ్డి

జడ్పీ చైర్మన్‌కు సన్మానం

వనపర్తి రాజీవ్‌చౌరస్తా : జిల్లా పరిషత్ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డిని గురువారం ఆయన ఛాంబర్‌లో పదవీకాలం పూర్తయిన సందర్భంగా జైభీమ్ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు, సాహితీ కళావేదిక ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన పదవీకాలంలో అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సాహితీ కళావేదిక అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్, డీఈవో గోవిందరాజులు, సంస్థ ప్రతినిధులు కంటే నిరంజనయ్య, పావనం చంద్రశేఖర్, బండారు సురేందర్, అంబటి స్వామి, కర్నే శివశంకర్, దాసరి కృష్ణ, సిద్దిరవి, బండారు శ్రీనివాస్, నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

జూపల్లి పాఠశాలను సందర్శించిన విదేశీ మహిళ

చారకొండ, జూలై 4: అలస్కా స్టేట్ (యూఎస్ఏ)కు చెందిన మహిళ నైనా ఇండియాలో ఇటీవల పర్యటిస్తున్నారు. అందులో భాగంగా రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర కార్యదర్శి విమలాదేవి ఆధ్వర్యంలో గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలం జూపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠాలను గురువారం సందర్శించారు. గ్రామాల్లో వాతావరణం, పాఠశాలలో విద్యాబోధనపై, విద్యార్థుల స్థితిగతులపై వివరాలను తెలుసుకున్న నైనా తెలుగులో మాట్లాడారు. హైదరాబాద్‌లో సెంట్రల్ యూనివర్సిటీలో పోస్టు గ్రాడ్యుయేట్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని విషయాలను విద్యార్థులతో చర్చించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ విమలాదేవి మాట్లాడుతూ విద్యార్థులు మంచి నైపుణ్యంతో ఆంగ్ల విద్యను పెంపొందించుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని అన్నారు. విదేశీ మహిళ నైనా, విమలాదేవిలను పాఠశాల ఉపాధ్యాయ బృందం సన్మానించారు. రెడ్‌క్రాస్ సొసైటీ మండల కార్యదర్శి నాయిని పరం జ్యోతి, ప్రధానోపాధ్యాయులు ఝాన్సీరాణి, ఉపాధ్యాయులు అమరేందర్, నారాయణ, విజయ లక్ష్మి, హరిలాల్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న విదేశీ మహిళ నైనా

ఏడో తేదీన 'యుద్ధంలో పావురం' కవిత్వం ఆవిష్కరణ

పాలమూరు, జూలై 4 : "యుద్ధంలో పావురం" ఖలీల్ కవిత్వంతో ఒకరోజు గడుపుదామని పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ ఎ.తిమ్మప్ప, కో-కన్వీనర్ కేసీ వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల ఏడవ తేదీన జిల్లా కేంద్రంలోని అల్మాస్ ఫంక్షన్ హాలులో ఖలీల్ కవిత్వం పుస్తకాన్ని ప్రొఫెసర్ జి.హరగోపాల్ చేత ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఖలీల్ విద్యార్థి జీవితంలోనే ప్రగతిశీల విద్యార్థి ఉద్యమంలోకి, విభజనలు, విద్వేషాలు కాక మను షల మధ్య వికసించాల్సిన సమసమాజ స్వప్నాలలోకి ఎదుగుతూ యువజన, కార్మికోద్యమాలలో కార్యకర్త, నాయకుడయ్యాడని అన్నారు. ఆ క్రమంలోనే అతడిలోని కవిని మేల్కొలిపిందన్నారు. ఆయన చాలా కవిత్వం రాశారని, అందివచ్చిన కవిత్వాన్ని కాలానికి అవసరమైన సంభాషణను అందించిన కవిత్వంగా గుర్తించి, పాలమూరు అధ్యయన వేదిక 'యుద్ధంలో పావురం' కవిత్వ సంపుటిగా ప్రచురించిందని గుర్తు తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ కవి కె.శివారెడ్డి ఆత్మీయ అతిథులుగా హాజరవుతారని తెలిపారు. కవి యాకూబ్, సామాజికవేత్త జిలుకర శ్రీనివాస్, కాచం సత్యనారాయణ, ఎం.రాఘవాచారి, హనీఫ్‌లు హాజరవుతారని తెలిపారు. ఖలీల్ మిత్రుల తోడ్పాటులో నిర్వహించే సభకు అందరూ హాజరు కావాలని పిలుపునిచ్చారు.

పెట్రోల్ బంకులో ఘరానా మోసం

» తనిఖీలు చేపట్టని అధికారులు

వనపర్తి రూరల్, జూలై 4 : వనపర్తి పట్టణ, మండలంలోని పెట్రోల్ బంకులో ఘరానా మోసం జరుగుతున్నా అధికారులు మాత్రం తనిఖీలు చేయడం లేదు. పెట్రోల్ బంకుల్లో ఎటువంటి వసతులు లేవని ఆరోపణలు వచ్చినా అధికారులు తనిఖీలు చేపట్టకపోగా ఇప్పుడు బ్లాక్‌లో పెట్రోల్ అమ్ముతున్నా పట్టించుకోకుండా ఉండడం గమనార్హం. వనపర్తి పట్టణం చిట్యాల రోడ్డులో గల మల్లికార్జున పెట్రోల్ బంకులో ఘరానా మోసం జరుగుతోంది. పెట్రోల్ బంకులో పనిచేసే వ్యక్తులు బంకుల నుంచి ఒక డబ్బాలో పెట్రోల్ తీసి రైతులు, అమాయక ప్రజలు వచ్చిన వారికి బంకు పనిచేయడం లేదని అందుకే పెట్రోల్ రావడం లేదు అని వాళ్లను నమ్మించి డబ్బాలో నుంచి పెట్రోల్ తీసి లీటర్ పోయాల్సిన పెట్రోల్‌ను హాఫ్ లీటర్‌తో సరిపెడుతు లీటర్‌కు డబ్బులు వసూలు చేస్తున్నారు. పెట్రోల్‌బంకు యజమాని మల్లికార్జున్‌ను వివరణ కోరగా రోజు ఐదు లీటర్ల పెట్రోల్ డబ్బాలో తీసి లెక్క తెలుసుకోవడానికి అమ్ముతున్నామని బంకులో పనిచేసే వ్యక్తులు నాకు చెప్పారు. ఇకనుంచి ఇటువంటి సంఘటన పునరుద్ధం కానివ్వను అని పేర్కొన్నారు. అధికారుల కనుసైగల్లోనే బంకులో మోసాలు జరుగుతున్నాయని పలువురు వాహనదారులు పేర్కొంటున్నారు.


పోసేందుకు డబ్బాలో సిద్ధంగా ఉంచిన పెట్రోల్

ఏడున ఉమ్మడి జిల్లా అండర్-23 క్రికెట్ జట్టు ఎంపిక


మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూలై 4 : హైదరాబాద్‌లో త్వరలో జరగనున్న హెచ్‌సీఏ టూడేస్ లీగ్ టోర్నీ పాల్గొనే ఉమ్మడి జిల్లా అండర్-23 జట్టును ఈ నెల ఏడున ఎంపిక చేస్తున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం సెక్రటరీ రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బోయపల్లి సమీపంలో గల ఎండీసీఏ స్టేడియం మైదానంలో ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. ఉదయం 8 గంటలకు ఆధార్ కార్డు, బోనఫైడ్, జనన ధ్రువపత్రంతో హాజరుకావాలన్నారు.

ఐటీఐ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తి రూరల్, జూలై 4 : వనపర్తి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆయా కోర్సుల్లో మిగిలిపోయిన సీట్ల భర్తీకి అర్హత కలిగిన విద్యార్థినీ, విద్యార్థుల నుంచి రెండో విడత అడ్మిషన్ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్, వనపర్తి జిల్లా కన్వీనర్ బక్కన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15 వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు, ఆన్‌లైన్ వెరిఫికేషన్ రుసుము రూ.100 చెల్లించాలని ఆయన పేర్కొన్నారు.

యువకుడి అదృశ్యం, కేసు నమోదు

పాన్‌గల్, జూలై 4 : వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం రేమద్దుల గ్రామానికి చెందిన కటిక సాయికిరణ్ అదృశ్యమయ్యాడు. ఎస్సై కల్యాణ్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. సాయికిరణ్ గత నాలుగైదు రోజుల నుంచి కన్పించడం లేదని సోదరుడు కటిక సాయితేజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు. యువకుడిని గుర్తిస్తే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు.


సాయికిరణ్ (ఫైల్)

యువతిపై కేసు నమోదు

పాన్‌గల్, జూలై 4 : ఆర్టీసీ బస్సులో ప్రయాణికులతో గొడవ పడడమే కాకుండా, బస్సు అద్దం పగులగొట్టిన యువతిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై కల్యాణ్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా పాన్‌గల్ మండల కేంద్రానికి చెందిన ఆది సునీత గురువారం వనపర్తి నుంచి పాన్‌గల్‌కు ఆర్టీసీ బస్సులో వచ్చింది. పాన్‌గల్‌లో బస్సు దిగే సమయంలో అడ్డు వచ్చిన తోటి ప్రయాణికులతో గొడవ పెట్టుకుంది. తోటి ప్రయాణికులతో పాటు, డ్రైవర్, కండక్టర్‌ను బూతు మాటలు తిడుతూ బస్సు అద్దాన్ని పగలగొట్టింది. ఘటనపై కండక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సునీతపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

25 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

అమరచింత, జూలై 4 : అక్రమంగా తరలిస్తున్న 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా అమరచింత మండలం తుక్యానాయక్ తండాలో సురేష్‌నాయక్ అనే వ్యక్తి తండా నుంచి అమరచింత వైపు బియ్యాన్ని తరలిస్తుండగా పక్కా సమాచారంతో పోలీసులు బులోరా వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. వాహనంలో 25 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు నిర్ధారణకు వచ్చి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఆ అధికారులు వచ్చి రేషన్ బియ్యం అని పూర్తిస్థాయిలో నిర్ధారించి పిటీషన్ ఇవ్వగా అమరచింత పోలీస్‌స్టేషన్‌లో సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి మృతి

కృష్ణ, జూలై 4 : రైలు కింద పడి నారాయణపేట జిల్లా కృష్ణ మండల కేంద్రానికి చెందిన శంకరప్ప మృతి చెందాడు. ఈ సంఘటన కర్ణాటక రాష్ట్రం హుబ్లీ రైల్వేస్టేషన్‌లో గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కృష్ణ మండల కేంద్రానికి చెందిన శంకరప్ప (45) వారం రోజుల క్రితం దండేలిలో ఉన్న తర్మల్ పవల్ లిమిటెడ్ కంపెనీ షెడ్ డౌన్ పనులు నిమిత్తం వెళ్లారు. మంగళవారం దండెలిలో శంకరప్ప ప్రైవేటు బస్సులో రాయిచూరుకు రిజర్వేషన్ చేసి సాటి స్నేహితులు తిరిగి గ్రామానికి బస్సులో పంపించారు. మార్గ మధ్యలో హుబ్లీలో బస్సు దిగిన శంకరప్ప అక్కడి నుంచి హుబ్లీ రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని రైలు కిందపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్యతో నలుగురు కూతుర్లు ఉన్నారు.

బాలికపై లైంగిక దాడి

▸▸ సొంత బాబాయ్ అఘాయిత్యం

కొత్తకోట, జూలై 4 : ఓ పదేళ్ల బాలికపై సొంత బాబాయే లైంగిక దాడి చేసిన సంఘటన వనపర్తిజిల్లా కొత్తకోట మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకున్నది. బాలిక తల్లిదండ్రులు జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు వెళ్లారు. ఇంటి వద్ద బాలికతో పాటు ఇద్దరు చెల్లెళ్లు అమ్మమ్మతో కలిసి ఉంటున్నారు. ఉదయం తొమ్మిది గంటల సమయంతో అమ్మమ్మ ఇంటి నుంచి బయటకు వెళ్లగా సొంత బాబాయ్ అయిన యువకుడు పదేళ్ల అన్న కూతురిని వారి ఇంట్లోకే ఎత్తుకెళ్లాడు. పక్కనే ఉన్న ఇద్దరు చెల్లెళ్లు ఏడ్చినా వినకుండా ఇంటి తలుపులు మూసుకున్నాడు. చిన్నారులు ఇద్దరూ ఏడ్చుకుంటూ చుట్టుపక్కల ఇళ్ల వారికి విషయం చెప్పడంతో వారు వచ్చే సరికే అత్యాచారం చేసి యువకుడు పరారయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు బాలికను జిల్లా ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపారు.

వ్యక్తికి రిమాండ్

మానవపాడు, జూలై 4 : తాకట్టు పెట్టిన భూమిని మరొకరికి విక్రయించిన ఘటనలో ఓ వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ చంద్రకాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండల పరిధిలోని నారాయణపురం శివారులో ఉన్న ఏసీ గోదాం యజమాని పూజరి రాఘవేంద్ర తన 10 ఎకరాల భూమిని స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ మహబూబ్‌నగర్ బ్రాంచిలో తాకట్టు పెట్టి రూ. 7.50 కోట్లు తీసుకున్నాడు. కానీ ఆ భూమిని వేరొకరికి విక్రయించాడు. ఈ విషయంపై బ్రాంచ్ అధికారులు ఫిర్యాదు చేయడంతో గురువారం పూజారి రాఘవేంద్రని అరెస్ట్ చేశారు. అలంపూర్ కోర్టులో ప్రవేశపెట్టి, న్యాయాధికారి కవిత ఆదేశం మేరకు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

1,420 లీటర్ల డీజిల్ పట్టివేత



ఊట్కూర్ పెట్రోల్ బంక్ వద్ద భద్రపర్చిన డీజిల్ డ్రమ్ములు

ఊట్కూర్, జూలై 4 : మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 1,420 లీటర్ల డీజిల్‌ను సివిల్ సప్లయ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు గురువారం దాడులు చేసి పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన విశ్వనాథ్, వెంకట్‌రెడ్డి అక్రమంగా కర్ణాటక రాష్ట్రం నుంచి డీజిల్‌ను తీసుకొచ్చి నిల్వ ఉంచారని విశ్వసనీయ సమాచారం మేరకు సివిల్ సప్లయ్ ఆర్ఐ కాళప్ప బృందం గ్రామానికి వెళ్లి అనుమానితుల ఇళ్లల్లో తనిఖీలు చేపట్టింది. ఈ తనిఖీల్లో తొమ్మిది డ్రమ్ముల్లో మొత్తం 1,420 లీటర్ల డీజిల్ లభించింది. పంచనామా నిర్వహించిన అనంతరం ఊట్కూర్ ఇండియన్ పెట్రోల్ బంక్ వద్ద డీజిల్‌ను భద్ర పరిచారు. డీజిల్‌ను నిల్వ ఉంచిన వారిపై కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ బాలరాజ్, కానిస్టేబుల్ మహేష్ పాల్గొన్నారు.

పీయూ అధ్యాపకుడికి డాక్టరేట్



పీయూ అధ్యాపకుడు ఎండీ గౌస్ మొహద్దీన్‌కు డాక్టరేట్ పత్రాన్ని అందజేస్తున్న పీయూ రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, అధికారులు

పాలమూరు యూనివర్సిటీ, జూలై 4 : పాలమూరు యూనివర్సిటీ ఎంసీఏ విభాగం అధ్యాపకుడు ఎండీ గౌస్ మొహద్దీన్‌కు డాక్టరేట్ లభించింది. డాక్టరేట్‌కు సంబంధించిన పత్రిక ప్రకటనను, డాక్టరేట్ పత్రాలను పీయూ రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, పీయూ పీజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకిరణ్ గురువారం పరిపాలన భవనంలో అందజేశారు. ఉస్మానియా యూనివర్సిటీలోని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం ప్రొఫెసర్ శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షణలో 'ఏ నోవెల్ టెక్నిక్యూ ఫర్ టెంపోరల్ ఫ్రీక్వెంట్ ఐటమ్సెట్ టు మైనింగ్' అనే అంశంపై పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఈయన పరిశోధన పత్రాలు జాతీయ, అంతర్జాతీయ జనరల్స్‌లో ప్రచురితమయ్యాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పీయూ రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి సిద్ది రామయ్యగౌడ్‌ను అభినందించి మరిన్ని పరిశోధనలు చేసి యూనివర్సిటీకి మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య



రాజశ్రీ (ఫైల్)

చారకొండ, జూలై 4 : మనస్తాపానికి గురై ఓ మహిళ పురుగుల మందు తాగి మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలంలో బుధవారం రాత్రి చోటుచేసుకొంది. ఎస్ఐ రాజశేఖర్ కథనం ప్రకారం.. మండంలోని సిర్సనగండ్ల గ్రామానికి చెందిన హరినాథ్‌రాజ్ కూతురు రాజశ్రీ (29) కృష్ణా జిల్లా ఖమ్మంపాడుకు చెందిన శేషుకుమార్‌తో 2014లో వివాహం జరిగింది. పిల్లలు పుట్టలేదని కారణంగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. మూడు నెలల క్రితం పిల్లల విషయంలో భర్తతో గొడవ పడి వచ్చి తల్లిదండ్రులతో కలిసి ఉంటుంది. బుధవారం వ్యక్తిగత పనుల మీద రాజశ్రీ తల్లిదండ్రులు పనిమీద చారకొండకు వెళ్లారు. భర్తతో ఫోన్‌లో మాట్లాడుతూ మనస్తాపానికి గురైన ఆమె మధ్యాహ్నం 12 గంటలకు పురుగుల మందు తాగింది. స్థానికులు తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో ఆమెను చికిత్స కోసం నల్గొండ జిల్లా మాల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ ఆదేరోజు రాత్రి 12 గంటల సమయంలో రాజశ్రీ మృతి చెందినట్లు తెలిపారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలు తండ్రి హరినాథ్‌రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ రాజశేఖర్ పేర్కొన్నారు.

విద్యానగర్ కాలనీలో చోరీ

కల్వకుర్తిటౌన్, జూలై 4 : నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని విద్యానగర్‌కాలనీలో నివాసం ఉంటున్న మాజీ ఎంపీపీ రామేశ్వరమ్మ ఇంట్లో దుండగులు బుధవారం రాత్రి చోరీకి పాల్పడినట్లు స్థానికులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. రామేశ్వరమ్మ వారి కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ వెళ్లడంతో గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడ్డారు. బీరువాను పగులగొట్టి అందులో ఉన్న రూ.20వేలు నగదు దోచుకున్నారని, ఇంట్లో బట్టలను చిందరవందర వేశారని, పక్కింటివారు గమనించి వారు సమాచారం ఇవ్వడంతో వారువచ్చి చూడగా దొంగతనం జరిగినట్లు గమనించారు. ఇదే కాలనీలో మరో ఇంటికి ఉన్నతాళం పగులగొట్టినట్లు కాలనీవాసులు తెలిపారు.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్టు

వంగూరు, జూలై 4: మండలంలోని సర్వారెడ్డిపల్లికి చెందిన వర్ష శేఖర్‌ను పాత గొడవలను మనసులో పెట్టుకొని ఈనెల 2న తిప్పారెడ్డిపల్లి గేటు సమీపంలో ముగ్గురు బీర్‌సీసాలతో పొడిచి గాయపరిచారు. ఈ కేసులో నిందుతులను గురువారం పోలీసులు అరెస్టు చేశారు. మండలంలోని తిర్మలగిరికి చెందిన మూడవత్ రాజు, మూడవత్ శ్రీను, డిండి మండలం ఎడ్లగడ్డ తండాకు చెందిన రాత్లావత్ గణేష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ మహేందర్ తెలిపారు.

క్రీడాభివృద్ధికి ప్రభుత్వం కృషి

▸▸ మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ▸▸ అట్టహాసంగా ప్రారంభమైన రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



బ్యాడ్మింటన్ ఆడుతున్న ఎమ్మెల్యే

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూలై 4 : క్రీడాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అండర్-19 బాల, బాలికల బ్యాడ్మింటన్ టోర్నీని గురువారం ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా పోటీలు నిర్వహించుకునేందుకు అద్భుతమైన ఇండోర్ స్టేడియం మనకు అందుబాటులో ఉందన్నారు. రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించడం సంతోషంగా ఉందని, క్రీడల నిర్వహణకు తమ వంతు సహకారం ఉంటుందన్నారు. జిల్లా క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎద గాలని ఆకాంక్షించారు. టోర్నీలో క్రీడాకారులు తమ ప్రతిభ చాటి రాణించాలని ఆకాంక్షించారు. జిల్లాలో ప్రతిభ గల క్రీడాకారులకు కొదవలేదని, ఎంతో మంది క్రీడాకారులు వెలుగులోకి వచ్చారని గుర్తు చేశారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని క్రీడాస్ఫూర్తి చాటాలన్నారు. అనంతరం షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను మునిసిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, మహబూబ్‌నగర్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ (ఎండీబీఏ) అధ్యక్షుడు ఎస్. శ్యామ్‌సుందర్ గౌడ్, తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, ఎండీబీఏ సెక్రటరీ ఎల్.రవికుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి సాదత్‌ఖాన్, ఉపాధ్యక్షుడు విజయ్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, చైతన్యరెడ్డి, రాంకుమార్, ట్రెజరర్ ఎల్.రాజశేఖర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మణ్ యాదవ్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

మొదటి రోజు ఫలితాలు

మహబూబ్‌నగర్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో రాష్ట్రస్థాయి అండర్-19 బాల, బాలికల బ్యాడ్మింటన్ టోర్నీ ఉత్సాహంగా ప్రారంభమైంది. గురువారం మొదట జరిగిన మ్యాచ్‌లో బాలికల డబుల్స్ విభాగంలో ఐశ్వర్య- రియా నీలుకుర్తి, అక్షయ చౌదరి- శ్రీవల్లి, నైనిక రెడ్డి-శ్రీఖా, శ్రీ వైష్ణవి-వైఎస్ సుప్రియ, హాసిని వర్మ - శ్రావ్య ఆకుల, సాయిశృతి - సమీక్ష యాదవ్, డబుల్స్ బాలుర విభాగంలో నవనీత్ - వెంకట్ మౌనిష్, అశ్రిత్ వలిశెట్టి - జయంశ్‌రెడ్డి, అభిషేక్ - వర్షిత్ శ్రీసాయి, అఖిల్‌రావు - నిషాంత్, మిక్స్‌డ్ డబుల్స్‌లో అజయ్ కార్తీక్ - కీర్తి, సాయి రిశ్వంత్-వేదశ్వివాసిరెడ్డి, వర్షిత్ శ్రీసాయి - అలీషాఖాన్, ప్రణయ్ శ్రీకర్ - శ్రీ వైష్ణవి, జలగం ప్రణీత్ - శిఖ విజయాలు నమోదు చేసుకున్నారు.

సింగిల్స్ బాలికల్లో వాసిరెడ్డి వేదస్వి 21-6, 21-4 తేడాతో ఈశ్వేతపై, హాసిని వర్మ 21-2, 21-6 తేడాతో తేజస్వినిపై, అనుమల శ్రీవల్లి 21-17, 21-18 తేడాతో సమీక్షరెడ్డిపై, కీర్తి 22-30, 21-15 తేడాతో లక్ష్మి రిదిమ దేవనిపై, నిసర్గ 21-11, 21-9 తేడాతో జ్యోషికాపై, రిష్తా పాండే 21-17, 21-13 తేడాతో అను సంజన మురళిపై, ప్రసన్న బోనం 21-10, 21-16 తేడాతో నైనికరెడ్డిపై, సింగిల్స్ బాలురలో అఖిల్ రావు 21-14, 21-17 తేడాతో సూర్య జాగర్లమూడిపై, జయేంశ్ రెడ్డి 21-14, 21-14 తేడాతో బొమ్మకంటి శ్రీ ఆదిత్యపై గెలుపొందారు.

టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి



రోడ్డు ప్రమాదంతో పేటలో ట్రాఫిక్ జామ్, ఇన్‌సెట్‌లో నర్సిరెడ్డి (ఫైల్)

నారాయణపేట, జూలై 4 : టిప్పర్ ఢీ కొన్ని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన నారాయణపేట జిల్లా మెయిన్ రోడ్డు గొడుగు గేరిలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మక్తల్‌కు చెందిన తిరుమల నర్సిరెడ్డితోపాటు మరొకరు స్కూటీపై వెళ్తుండగా టిప్పర్ సుభాష్ రోడ్డు నుంచి నుంచి పాత బస్టాండ్ వైపు టిప్పర్ వేగంగా వెళ్తూ.. గొడుగుగేరి దగ్గర హజీఖాన్‌పేట నుంచి మెయిన్ రోడ్డుకు రాగానే ప్రమాదవశాత్తు స్కూటీని ఢీకొంది. ఈ ఘటనలో టిప్పర్ టైరు కింద పడి నర్సిరెడ్డి (34) అక్కడికక్కడే మృతి చెందగా, శరీరం రెండు భాగాలైంది. కాసేపు మేయిన్ రోడ్డులో ట్రాఫిక్ జామ్ అయ్యింది. స్కూటీపై ఉన్న మరో వ్యక్తి గాయాలపాలు కావడంతో అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే మృతుడు నర్సిరెడ్డికి భార్య భీమమ్మ, ఏడాది కవల పిల్లలు ఉన్నారు. భార్య భీమమ్మ అంధురాలు పేట మునిసిపాలిటీలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తోంది. రోడ్డు ప్రమాదంలో తన భర్త ప్రాణాలు కోల్పోవడంతో కన్నీరు మున్నీరైంది. జిల్లా అసుపత్రిని మునిసిపల్ కమిషనర్ సునిత, మాజీ మార్కెట్ చైర్మన్ బండి వేణుగోపాల్, గందె చంద్రకాంత్ సందర్శించి, భీమమ్మను ఓదార్చారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి, ముగ్గురికి గాయాలు

కొత్తకోట, జూలై 4 : వనపర్తి జిల్లా కొత్తకోట పట్టణ సమీపంలోని జాతీయ రహదారి మల్లంబావి జంక్షన్‌లో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జోగుళాంబ గద్వాల జిల్లా గద్వాల మండలం కొండపల్లి గ్రామానికి చెందిన రామాంజనేయులు(38), ఈరన్నలు కూలీ పని కోసం హైదరాబాద్‌కు వెళ్లేందుకు గాను బుధవారం కొత్తకోటకు వచ్చారు. రాత్రి కావడంతో బస్టాండ్‌కు బస్సులు రావడం లేదని జాతీయ రహదారి మల్లంబావి జంక్షన్‌కు వెళ్లారు. హైదరాబాద్ వైపు వెళ్తున్న వాహనాలను ఆపుతుండగా ఓ కారు వీరిని ఢీకొట్టింది. ప్రమాదంలో రామాంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు.

విషయం తెలుసుకున్న పోలీసులు గాయపడిన ఈరన్నను చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. రామాంనేయులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించి, బంధువులకు సమాచారం ఇచ్చారు. మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కల్వకుర్తిటౌన్, జూలై 4 : చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. ఎస్సై మాధవరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ మండలం శ్రీపురం గ్రామానికి చెందిన సాయిదీపక్ (24) ఈ నెల 2న నాగర్‌కర్నూల్ నుంచి బయలుదేరి కల్వకుర్తి మీదుగా హైదరాబాద్ వెళుతున్నాడు. అతడు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పి పట్టణంలోని సిల్వర్‌జూబ్లీ క్లబ్‌వద్ద డివైడర్‌ను ఢీకొని తలకు బలమైన గాయమైంది. గాయపడ్డ వ్యక్తిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఆయన పేర్కొన్నారు. మృతుని తల్లి శారద ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు 2వ ఎస్సై రామచందర్‌జీ తెలిపారు.

8న జాతీయ అప్రెంటిషిప్ మేళా

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జూలై 4 : ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటిష్‌షిప్ మేళా, స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అప్రెంటిషిప్ మేళా (అండర్ అప్రెంటిస్షిప్ యాక్ట్ 1961) దేశములోని అన్ని జిల్లాలో నిర్వహించనున్నట్లు జిల్లా నోడల్ అధికారి శాంతయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాల మెట్టుగడ్డలో ఈనెల 8న ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేళాకు దాదాపు 20 కంపెనీల నుంచి ప్రతినిధులు వస్తారని తెలిపారు. అర్హతగల అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ట్రాక్టర్ కిందపడి వ్యక్తి మృతి

▸▸ కేసు నమోదు చేసిన పోలీసులు ▸▸ వ్యక్తమవుతున్న పలు అనుమానాలు



దుబ్బన్న (ఫైల్)

గద్వాల, జూలై 4 : జోగుళాంబ గద్వాల జిల్లా గద్వాల మండల పరిధిలోని సంగాలలో గురువారం ఉదయం ట్రాక్టర్ కిందపడి దుబ్బన్న (40) అనే వ్యక్తి మృతి చెందాడు. సంఘటనకు సంబంధించి రూరల్ ఎస్ఐ పర్వతాలు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమాని చిన్న వీరన్న రాయి తీసుకరావడానికి కూలీలతో వెళ్లాడు, రాయి తీసుకొస్తుండగా ట్రాక్టర్‌పై కూర్చొని ఉన్న దుబ్బన్న 99వ ప్యాకేజీ కాలువ వద్ద ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. ఆయనపై నుంచి ట్రాలీ టైర్ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లి పెంటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు. అయితే ఈ సంఘటనపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఫిల్టర్ ఇసుకను తరలిస్తుండగా ప్రమాదం జరిగి దుబ్బన్న మృతి చెందాడని తెలుస్తోంది. సంఘటనా స్థలానికి పోలీసులు వచ్చే లోపు మృతుడి కుటుంబంతో రాజీ చేసుకొని మృతదేహాన్ని ఇంటికి తరలించారు. ఫిల్టర్ ఇసుకను డంపులో వేసి, అక్కడి నుంచి ట్రాక్టర్‌ను కనిపించకుండా చేశారనే విషయాలు వెలుగులోకి వచ్చాయి. పోలీసులు ఫిర్యాదులోని అంశాలను పరిగణనలోకి తీసుకొని కేసు నమోదు చేశారని తెలుస్తోంది. అక్కడికి సమీపంలో ఉన్న ఫిల్టర్ ఇసుకను పరిశీలించినా, దానిని పరిగణనలోకి తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి



శివ (ఫైల్)

కోడేరు, జూలై 4 : నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల పరిధిలోని రేకులపల్లితండా గ్రామంలో విద్యుదాఘాతంతో శివ (16) మృతి చెందిన సంఘటన గురువారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రేకులపల్లి గ్రామంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో వీధి లైట్లు వేయాలని ఒప్పితండాకు చెందిన మూడావత్ మనోహర్‌ను గ్రామపంచాయతీ కార్యదర్శి బిచ్చయ్య తెలిపారు. మనోహర్ భార్య గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికురాలు కావడంతో తన కుమారుడు శివకు ఎలక్ట్రికల్ పని వస్తుందని అతనితో వీధి లైట్లు వేయడానికి పురమాయించారు. వీధి లైట్లు వేసే క్రమంలో విద్యుత్ స్తంభం ఎక్కి బల్బులు వేస్తుండగా అదే స్తంభానికి 11కేవీ వైర్లు ఉండడంతో 11కేవీ వైరు తగిలి విద్యుత్‌షాక్‌తో కింద పడగా పక్కనే ఉన్న వన్‌ఫేజు ట్రాన్స్‌ఫార్మర్ మీద పడి అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. మనోహర్, శివమ్మ దంపతులకు ఒక కుమారుడు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. ఉన్న ఒక్క కుమారుడు మృతి చెందడంతో వారి కుటుంబం కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. శివ పాన్‌గల్ మండలం తెల్లరాళ్లపల్లి గ్రామంలో లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో పదవ తరగతి చదువుతున్నారని తెలిపారు. తండ్రి మనోహర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని కొల్లాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కురుమూర్తి తెలిపారు.

పీయూ విద్యార్థి నాయకుల అరెస్టు

▸▸ గ్రూప్-2 పోస్టులు పెంచాలని డిమాండ్ ▸▸ టీజీపీఎస్సీ ముట్టడిస్తున్నారని ముందస్తుగా అరెస్టు



మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో అరెస్ట్ అయిన పీయూ విద్యార్థి నాయకులు

పాలమూరు యూనివర్సిటీ, జూలై 4 : తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం గ్రూప్-2 పోస్టులను పెంచాలని పీయూ విద్యార్థులు నిరసన తెలుపుతూ గురువారం బంద్‌కు పిలుపునిచారు. అదే విధంగా టీజీపీఎస్సీని ముట్టడి చేస్తున్నారని తెలవడంతో మహబూబ్‌నగర్ రూరల్ ఎస్ఐ విజయ్‌కుమార్ తన సిబ్బందితో పీయూకు చెరుకొని గురువారం తెల్లవారు జామున పీయూ విద్యార్థి నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పీయూ విద్యార్థి నాయకులు పోలీస్ స్టేషన్ లోనే నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ గ్రూప్-1 పోస్టులతో పాటు గ్రూప్-2 పోస్టులను పెంచాలని డిమాండ్ చేశారు. డీఎస్సీలో 30వేల పోస్టులను భర్తీ చేయాలని, గ్రూప్-1 పోస్టుల కోసం ప్రిలిమ్స్‌లో 1:100 నిష్పత్తిలో మెయిన్స్‌కి ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీని 45 రోజులు వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. పీయూ విద్యార్థి నాయకులు పీయూ జేఏసీ చైర్మన్ బత్తిని రాము, పీయూ ఎస్ఎస్‌యూఐ, బీఎస్ఎఫ్ అధ్యక్షుడు రూప్‌సింగ్, ఎంఎస్ఎఫ్ అధ్యక్షుడు మీసాల గణేష్, ఏబీవీపీ అధ్యక్షుడు కృష్ణ కుమార్, ఏఐఎస్ఎఫ్ అధ్యక్షుడు పవన్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

పాత చోరీ కేసును ఛేదించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ తిరుపాజి

బాలానగర్, జూలై 4 : బాలానగర్ గ్రామ రైల్వే రోడ్‌లో గల మల్లేకేడి రవీందర్ ఇంట్లో సెప్టెంబరు మూడవ తేదీన 2018వ సంవత్సరంలో జరిగిన చోరీ కేసును ఛేదించినట్లు ఎస్ఐ తిరుపాజి వెల్లడించారు. గురువారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. మల్లేకేడి రవీందర్ సొంత గ్రామం చింతగూడెం. బాలానగర్‌లో అద్దెకు ఉంటున్నాడు. 2018 సెప్టెంబరు 3న బాలానగర్‌లోని అద్దె ఇంటికి తాళం వేసి సొంత గ్రామానికి వెళ్లాడు. బాలానగర్ మండలం మామిగుట్ట తండాకు చెందిన ఇస్లావత్ శరత్ రవీందర్ ఇంటి తాళం విరగొట్టి, బీరువాలో ఉన్న తులం బంగారు బుట్టలు, 30 తులాలు మూడు జతల వెండి కాళ్ల గొలుసులు, పది తులాల వెండి కడేలు, రూ. ఆరువేలు చోరీ చేశారు. ఎవరో గుర్తు తెలియని దొంగలు దొంగిలించారని అప్పట్లో కేసు నమోదైందని వెల్లడించారు. గురువారం ఎస్పీ ఆదేశాల మేరకు చెక్ పోస్ట్‌లో ఎస్ఐ తిరుపాజి తన సిబందితో తనిఖీలు చేస్తుండగా తుపాన్ వాహనంలో నుంచి పోలీసులను చూసి పారిపోతున్న ఇస్లావత్ శరత్‌ను పట్టుకొని విచారించగా, తాను 2018లో ఈ దొంగతనానికి పాల్పడినట్లు నేరం ఒప్పుకున్నాడని తెలిపారు. చోరీకి పాల్పడిన శరత్‌ను జడ్చర్ల కోర్టులో హాజరు పర్చగా న్యాయాధికారి రిమాండ్‌కు ఆదేశించారని ఎస్ఐ తెలిపారు.

ఐటీడీఏ ఏపీవోగా యాదమ్మ నియామకం

మన్ననూర్, జూలై 4: నాగర్‌కర్నూలు జిల్లా మన్ననూరు ఐటీడీఏ కార్యాలయ ఏపీవోగా యాదమ్మ గురువారం విధుల్లో చేరినట్లు ఐటీడీఏ ఇన్‌ఛార్జి పీవో రోహిత్ గోపిడి తెలిపారు. ఇటీవల ఐటీడీఏ కార్యాలయంలో అధికారులు అందుబాటులో లేక పోవడంతో తమ సమస్యలు తీరడం లేదని రెగ్యూలర్ పీవోతో పాటుగా కార్యాలయ సిబ్బందిని నియమించాలని ఈనెల 2న మన్ననూరుకు వచ్చిన పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క కు ఆదివాసీలు ఫిర్యాదు చేశారు. గురువారం గిరిజన సంక్షేమ శాఖ సెక్రటరీ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్ ఏటీడీవోగా పనిచేస్తున్న యాదమ్మను డిప్యూటేషన్‌పై మన్ననూరు ఐటీడీఏ కార్యాయలయానికి పంపించారు. ప్రభుత్వం నుంచి సానుకూలంగా స్పందన వస్తుండడంతో స్థానిక చెంచులు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

ఆర్ఐటీఐలో రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మన్ననూర్, జూలై 4 : అమ్రాబాద్ మండలం మన్ననూరు గిరిజన పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఆర్ఐటీఐ)లో 2024-25-26 విద్యా సంవత్సరాల్లో రెండో విడత ప్రవేశాలు పొందేందుకు జూలై 4 నుంచి 15వ తేదీ వరకు అంతర్జాలంలో దరఖాస్తులు చేసుకోవాలని ఆర్ఐటీఐ ప్రిన్సిపల్ జయమ్మ తెలిపారు. కళాశాలలో ఎలక్ట్రీషియన్, మోటారు వెహికిల్ మెకానిక్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, కోపా కోర్సుల్లో సీట్లను అర్హులైన విద్యార్థులనుంచి భర్తీ చేసి నూతన ప్రవేశాలు కల్పిస్తామన్నారు. విద్యార్థులు తమ ఫోన్ నంబరుతో ఐటీఐ తెలంగాణ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకొని ఆసక్తి కలిగిన కోర్సుల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదోతరగతి ఉత్తీర్ణత పత్రంతో పాటుగా, ఆధార్, కులం, ఆదాయం ధ్రువీకరణ పత్రాలను జత చేయాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న వారికి నిర్వహించే కౌన్సెలింగ్‌లో రిజర్వేషన్, పదో తరగతి మార్కుల మెరిట్ ఆధారంగా ప్రవేశాలను కల్పిస్తామని, అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రథమ చికిత్సా కేంద్రాల తనిఖీ

▸▸ బల్గెరలో సాక్షి పాలి క్లినిక్ సీజ్



గట్టులోని ఆర్ఎంపీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారి శశికళ, వైద్య బృందం

గట్టు, జూలై 4 : మండల పరిధిలోని బల్గెర, గట్టు గ్రామాల్లో ఆర్ఎంపీలు నిర్వహిస్తున్న ప్రథమ చికిత్సా కేంద్రాలను జిల్లా వైద్యాధికారి డాక్టర్ శశికళ, ఉప వైద్యాధికారి ఎస్‌కే సిద్ధప్ప, మాత శిశు సంరక్షణ ప్రోగ్రాం అధికారి డాక్టర్ స్రవంతి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బల్గెరలో ఎస్. కేశవనాయుడు నిర్వహిస్తున్న సాక్షి పాలిక్లినిక్ పేరుతో రిజిస్ట్రేషన్ చేసుకోకుండా చికిత్సా కేంద్రం నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. తనిఖీలు నిర్వహించి ఆక్సిజన్ సిలిండర్లు, బేబీ వార్మర్, ఆక్సిజన్ కొలిచే యంత్రం, రెఫరల్ స్లిప్స్‌ను స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. నర్సింహులు అనే వ్యక్తి నిర్వహిస్తున్న ప్రథమ చికిత్సా కేంద్రంలో యాంటీబయోటిక్స్ పెయిన్ కిల్లర్ ఇంజక్షన్లు, సర్జరీ పరికరాలు, నెబ్యులైజర్‌లను స్వాధీనం చేసుకున్నారు. గట్టులో రాఘవేంద్ర అనే వ్యక్తి నిర్వహిస్తున్న ప్రథమ చికిత్స కేంద్రంలో సూదులు, కాటన్, గ్లూకోజ్ బాటిళ్లు, వైల్స్ అన్ని ఒకే డబ్బాలో వేయడాన్ని గుర్తించి హెచ్చరించారు. ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో శశికళ హెచ్చరించారు.

పర్యావరణాన్ని కాపాడటం ప్రతీ ఒక్కరి బాధ్యత

- ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి



మొక్కను నాటుతున్న ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 4: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడడం ప్రతీ ఒక్కరి బాధ్యతని ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ బాలుర మైదానంలో జ్ఞాన వికాస భారతి సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమానికి ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి హాజరై మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా మొక్కను నాటడమే కాకుండా దాన్ని సంరక్షించే బాధ్యత కూడా తీసుకుంటే పర్యావరణ లక్ష్యం నెరవేరుతుందని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో జ్ఞాన వికాస భారతి కృషి అభినందనీయమన్నారు. కౌన్సిలర్లు కావలి శ్రీను, నిజాం, సుల్తాన్, జ్ఞాన వికాస భారతి సంస్థ అధ్యక్షుడు బ్రహ్మచారి, మన్యంచారి, వెంకటేష్, జంగయ్య, సంజీవ్‌గౌడ్, బాలస్వామి, సునందనాచారి, రమాదేవి, అమరేశ్వర్‌రావు, జగన్మోహన్‌రావు, బీరయ్య, చిన్నయ్య, మల్లేష్, సుబ్బయ్య, కరాటే మాస్టర్ రవీందర్, మురళి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులు ప్రజల్లో ఉండాలి

తెలకపల్లి: ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ప్రజలతో మమేకమై పోవాలని ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మండల సమావేశపు హాలులో జరిగిన ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు, జడ్పీటీసీల వీడ్కోలు సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులందరికీ శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఎంపీపీ కొమ్ము మధు, జడ్పీటీసీ సభ్యురాలు సుమిత్ర, వివిధ గ్రామాల ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పునుంతలలో కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు

ఉప్పునుంతల, జూలై 4: మండల కేంద్రమైన ఉప్పునుంతలలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో గురువారం జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ రమేష్‌చంద్ర ఆధ్వర్యంలో ఏడుగురికి కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు హరిత, స్వప్న, బిక్కునాయక్, రమాకాంత్, శివలీల, ఫార్మాసిస్ట్ శ్రీనివాసులు, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

రైతు భరోసాకే ప్రజాభిప్రాయ సేకరణ



సమావేశంలో మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ తలసాని జనార్దన్‌రెడ్డి

కల్వకుర్తి, జూలై 4 : రైతులకు రైతు భరోసా ఇచ్చేందుకు రైతుల నుంచి ప్రభుత్వం అభిప్రాయ సేకరణ నిర్వహించడం జరుగుతుందని పీఏసీఎస్ చైర్మన్ తలసాని జనార్దన్‌రెడ్డి, డీసీవో రఘునాథ్‌లు అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని పీఏసీఎస్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం గురువారం పీఏసీఎస్ పరిధిలోని ఊర్కొండ, కల్వకుర్తి మండలాల్లో సంఘం సభ్యులుగా ఉన్న రైతులతో మహాజన సభ నిర్వహించారు. సమావేశానికి పీఏసీఎస్ చైర్మన్ తలసాని జనార్దన్‌రెడ్డి అధ్యక్షత వహించగా డీసీవో రఘునాథ్, మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, వైస్ చైర్మన్ షాహేద్, రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సమావేశంలో రైతుభరోసాపై అభిప్రాయాలను సేకరించారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ శ్యాంసుందర్, పీఏసీఎస్ డైరెక్టర్లు రామునాయక్, శ్రీనివాసరావు, వెంకటయ్య, ఫరీదాబేగం, రాజావర్ధన్‌రెడ్డి, కృష్ణగౌడ్, సైదమ్మ, సీఈవో వెంకట్‌రెడ్డి, ఏవో శ్రీలత, కల్వకుర్తి, ఊర్కొండ మండలాలకు చెందిన 257మంది రైతులు పాల్గొన్నారు.

● కోడేరు: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం ఆవరణలో సంఘం చైర్మన్ బి.చిన్నారెడ్డి అధ్యక్షతన అత్యవసర మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు భరోసాకు సంబంధించి రైతుల నుంచి అభిప్రాయ సేకరణ కోరగా.. పదెకరాల వరకు రైతు భరోసా కల్పించాలని కొందరు, అందరికి కల్పించాలని కొందరు ఐదెకరాలలోపు ఇవ్వాలన్నారు. రైతుల అభిప్రాయాలను ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు పంపనున్నట్లు ఏడీఏ రవి అన్నారు. సింగిల్ విండో వైస్ చైర్మన్ సింగారపు శివుడు, డైరెక్టర్లు ఎం.జగన్మోహన్‌రెడ్డి, ఎస్.మహేశ్వర్‌రెడ్డి, డి.నరసింహారెడ్డి, ఏవో శ్రీరాం, ఏఈవోలు మధుసూదన్‌రెడ్డి, పృథ్వీ, ప్రియాంక, పీఏసీఎస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి

కొల్లాపూర్, జూలై 4 : భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో బ్రిటీష్ పాలకులను గడగడలాడించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 127వ జయంతి వేడుకలను గురువారం కొల్లాపూర్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు యువజన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని పాత బస్టాండ్‌లో ఉన్న అల్లూరి విగ్రహానికి స్వచ్ఛంద సంస్థ అధ్యక్ష కార్యదర్శులు పి.సత్యనారాయణ, వెంకటయ్య పూల మాలలు వేసి నివాళులర్పించారు. స్వచ్ఛంద సంస్థ సభ్యులు సుధాకర్, చక్రపాణి, బాబు, మల్లయ్య విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా రోశయ్య జయంతి వేడుకలు

వెల్దండ, జూలై 4 : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ దివంగత కే రోశయ్య జయంతి వేడుకలను గురువారం జిల్లా ఆర్యవైశ్య మహాసభ, మండల ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఆర్యవైశ్య సంఘం జిల్లా మహాసభ అధ్యక్షుడు బచ్చురామకృష్ణ, జిల్లా ప్రధానకార్యదర్శి కల్మిచర్ల రమేష్, అదనపు ప్రధాన కార్యదర్శి శ్రీధర్, మండల అధ్యక్షుడు ఉప్పు ఆంజనేయులు, వజ్రలింగం, కుమారస్వామి, రమేష్, శివకుమార్, సంతోష్, రాఘవేందర్, జగదీశ్వర్, శ్రీను, సైదులు ఉన్నారు.

ఉద్యాన పంటల సాగుపై రైతులకు అవగాహన, శిక్షణ

బిజినేపల్లి, జూలై 4 : మండలంలోని నంది వడ్డెమాన్‌లోని రైతు వేదికలో గురువారం జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో ఉద్యాన పంటల సాగుపై అవగాహన, శిక్షణ నిర్వహించినట్లు జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి చక్రపాణి తెలిపారు. ఆయిల్ పామ్ సాగు చేపట్టిన రైతులకు నర్సరీలో మొక్కల ఎంపిక, పొలంలో నాటు విధానం, పోషకాల యాజమాన్యం, నీటి యాజమాన్యం, చీడపీడల నివారణ, పూత దశలో ఆడ, మగ పూలను సంపర్కం చేయడం, ఆయిల్ పామ్ ప్రొడక్షన్, రెగ్యులేషన్ యాక్టు 1993 గురించి వివరించినట్లు ఆయన పేర్కొన్నారు. మండల వ్యవసాయశాఖ అధికారి నీతి రెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ వెంకటస్వామి, కొల్లాపూర్ డివిజన్ ఉద్యాన అధికారి లక్ష్మణ్, ఏఈవో మధు, మల్లేశ్వరరావు, రాకేష్, క్లస్టర్ ఆఫీసర్ శివరాజు తదితరులు ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి దాత చొరవ

- రూ.16 లక్షలతో హన్‌మాన్ గుడి నిర్మాణానికి సహకారం



నిర్మాణంలో ఉన్న హన్‌మాన్ దేవాలయం పనులు

వంగూరు, జూలై 4: హన్‌మాన్ దేవాలయాభివృద్ధికి దాత చొరవ తీసుకున్నారు. వంగూరు మండలంలోని కొండారెడ్డిపల్లి గ్రామ సమీపంలో వెలసిన వీరబ్రహ్మం గారి ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. ఈ ఆలయం పక్కన నూతనంగా హన్‌మాన్ దేవాలయం, కల్యాణ మండపం నిర్మించేందుకు గ్రామానికి చెందిన ముత్యాల విష్ణువర్ధన్‌రెడ్డి ముందుకు వచ్చారు. రూ. 16 లక్షలతో ఆలయ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే కల్యాణ మండపం పనులు పూర్తికాగా హనుమాన్ ఆలయ నిర్మాణ పను లు స్లాబ్ లెవల్‌లో ఉన్నాయి. కాగా, మా గ్రామంలో ఆలయం అభివృద్ధి చేసుకోవ డం ఎంతో ఆనందంగా ఉందని విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

మాజీ సర్పంచ్ మృతి

వంగూరు, జూలై 4: మండలంలోని పోల్కంపల్లి తాజా మాజీ సర్పంచ్ చెన్నయ్య (70) గురువారం అకాల మరణం చెందారు. కొంత కాలంగా చెన్నయ్య అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మృతి చెందాడు. గ్రామానికి చెన్నయ్య సర్పంచ్‌గా ఉండి ఎంతో సేవ చేశాడని, ఆయన మృతి చెందినట్లు గ్రామస్థులు, పార్టీ నాయకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

పదవికే విరమణ కానీ..

- ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



సన్మానం పొందిన మండల పరిషత్ ప్రజా ప్రతినిధులతో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

ఉప్పునుంతల, జూలై 4 : పదవికే విరమణ కానీ ప్రజాప్రతినిధులకు కాదని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. మండల ప్రజా పరిషత్ ప్రజాప్రతినిధులకు జూలై 3వ తేదీన పదవీ కాలం ముగియడంతో గురువారం ఉప్పునుంతలలో ఓ ఫంక్షన్ హాల్‌లో మండల ప్రజా పరిషత్ ప్రజాప్రతినిధుల పదవీ విరమణ కార్యక్రమం ఎంపీపీ తిప్పర్తి అరుణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. అనంతరం ఎంపీపీ అరుణ, ఎంపీటీసీ సభ్యులు రామలక్ష్మ్మ, కమిత, అనురాధ, వెంకటేష్, మల్లేష్, నాగయ్య, శ్యామలీలా, జడ్పీటీసీ సభ్యుడు ప్రతాప్‌రెడ్డిలను ఎమ్మెల్యే శాలువా కప్పి సన్మానం చేశారు. తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో బాలచంద్రర్ సృజన్, మండల ప్రత్యేక అధికారి రాజేందర్, సింగిల్‌విండో చైర్మన్ భూపాల్‌రావు, నాయకులు నర్సింహారెడ్డి, అనంతారెడ్డి, చంద్రమౌళి, జక్కా చంద్రశేఖర్‌రెడ్డి, విశాంత్రి ఎంపీడీవో లక్ష్మణ్‌రావు, డీఎల్‌పీవో వెంకటయ్య, ఎంపీవో నారాయణ, సింగిల్‌విండో మాజీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, బుచ్చిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జగత్‌రెడ్డి ఉన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

మండల పరిధిలోని కంసానిపల్లి గ్రామంలో రూ.కోటి 56 లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు, కాలువ పనులకు గురువారం ఎమ్మెల్యే వంశీ కృష్ణ శంకుస్థాపన చేశారు. తహసీల్దార్ శ్రీ కాంత్, ఎంపీడీవో బాలచంద్రర్ సృజన్, డీఎల్ పీవో వెంకటయ్య, ఎంపీవో నారాయణ, ఆర్‌అండ్‌బీ డీఈ జలేందర్, ఏఈ అక్షిపతి, ఎంపీపీ అరుణ, జడ్పీటీసీ సభ్యుడు అనంతా ప్రతాప్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు అనురాధ రఘపతిరెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ, గోవర్ధన్‌రెడ్డి, నర్సింహరావు, చిన్న జంగిరెడ్డి, నర్సింహరెడ్డి, జక్కా చంద్రశేఖర్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జగత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

చారకొండ: రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. గురువారం మండల కేంద్రంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఎమ్మెల్యే వంశీకృష్ణ ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల కేంద్రంలో రూ. 1.33 కోట్లతో 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ఎంపీపీ గుండె నిర్మల. విజేందర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ జెల్ల గురువయ్య గౌడ్, ఎంపీటీసీ సభ్యుడు గ్యార లక్ష్మణ్, విద్యుత్ శాఖ డీఈ శ్రీధర్‌శెట్టి, ఏడీ చంద్రశేఖర్, ఏఈ జానకిరాం నాయక్, సివిల్ ఏఈఈ శ్రీనివాస్, లైన్‌ఇన్‌స్పెక్టర్ రాజు, లైన్‌మెన్‌లు శేఖర్, శ్రీను, జేఎల్‌ఎంలు కరచ్‌చంద్, చందులాల్, బలరాంనాయక్, వెంకటయ్య, కళ్యాణ్, ఆయాబ్, అచ్చంపేట బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు గుండె వెంకట్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జమ్మికింది బాల్‌రాంగౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పానుగంటి అంజయ్య కాంగ్రెస్ మండల యూత్ ప్రెసిడెంట్ గణేష్‌గౌడ్, మాజీ సింగిల్‌విండో చైర్మన్ జెల్ల కృష్ణయ్యగౌడ్, ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు గోరటి శివ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు లక్ష్మయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

● వంగూరు: ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుభరోసా పథకంపై రైతుల అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. గురువారం రంగాపూర్‌లో రైతుభరోసా పథకంపై రైతుల అభిప్రాయాలు తీసుకున్నారు. ఎంపీపీ భీమమ్మ, జడ్పీటీసీ సభ్యుడు కేవీఎన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సంధ్య, పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, డీసీవో రఘునాథ్‌రావు, తహసీల్దార్ కిరణ్మయి, సీఈవో విష్ణుమూర్తి, వైస్ చైర్మన్ బాలస్వామి, ఎంపీటీసీ సభ్యుడు రమేష్‌గౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి, పండిత్‌రావు, క్యామ మల్లయ్య, పులిజాల కృష్ణారెడ్డి, లాలుయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్ విజయవంతం



నాగర్‌కర్నూల్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 4: నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్, ఎన్‌ఎస్‌యూఐ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన బంద్ విజయవంతమైంది. బంద్‌లో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి తారాసింగ్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రేమ్‌కుమార్, ఎన్‌ఎస్‌యూఐ నాగర్‌కర్నూల్ అసెంబ్లీ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొని పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలను మూసి వేయించారు. అనంతరం పట్టణంలో అంబేడ్కర్ చౌరస్తాలో విద్యార్థులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ నిర్లక్ష్యం వల్లే నీట్ పరీక్షలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. నీట్ పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించే వరకు దేశ వ్యాప్తంగా విద్యార్థి సంఘాల ఆందోళనలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి నీట్ కౌన్సెలింగ్‌ను రద్దు చేసి తిరిగి పరీక్ష నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మధుగౌడ్, ఉపాధ్యక్షుడు నరేష్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కార్తీక్, గణేష్, భానుచరణ్, శివ, అభినయ్, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు ఆకాష్‌రెడ్డి, రామకృష్ణ, బన్నీ, భరత్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

● అచ్చంపేట టౌన్: విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతం అయిందని ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు సంతోష్ అన్నారు. నీట్ పరీక్షలో అవకతవకలు అయినందున నీట్ పరీక్షలు రద్దు చేయాలని గురువారం తలపెట్టిన బంద్‌ను ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు పాటించారు. అనంతరం విద్యార్థి సంఘాల నాయకుల ఆధ్వర్యంలో అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు సైదులు, ఎస్‌ఎఫ్‌ఐ అధ్యక్షుడు సయ్యద్ పాల్గొని మాట్లాడారు. నీట్ పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలన్నారు. నూతన విద్యా విధానాన్ని నీట్‌ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. నీట్ పరీక్ష బాధ్యులైన విద్యార్థులకు నష్టపరిహారం కేంద్ర ప్రభుత్వం చెల్లించాలన్నారు. నీట్ పరీక్షను రాష్ట్రాలకు అప్పజెప్పాలన్నారు. నీట్‌పై తెలంగాణ రాష్ట్రంలో ఉన్న బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడాలన్నారు. విద్యార్థి సంఘాల నాయకులు మహేష్, లడ్డుయాదవ్, వినోద్, సోహెల్, సుల్తాన్, తిరుపతి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

● కల్వకుర్తి: దేశవ్యాప్తంగా మెడికల్ విద్యార్థులకు నిర్వహించే నీట్ పరీక్షలో అవకతవకలను నిరసిస్తూ జాతీయ పరీక్ష సమగ్రతను కాపాడాలని వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం దేశవ్యాప్తంగా నిర్వహించిన విద్యా సంస్థల బంద్ కల్వకుర్తిలో విజయవంతమైంది. కల్వకుర్తి పట్టణంలో ఎస్‌ఎఫ్‌ఐ, పీడీఎస్‌యూ, ఎన్‌ఎస్‌యూఐల ఆధ్వర్యంలో కళాశాలలు, పాఠశాలలను బంద్ చేయించారు. ఈ సందర్భంగా ఆయా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాని మంత్రి స్పందించి ఎన్‌టీఏను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో పేపరు లీకేజీల వల్ల ఎంతో కష్టపడి చదువుతున్న విద్యార్థులకు తీరని నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని పేర్కొన్నారు. పీడీఎస్‌యూ నాయకులు సంతోష్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు జమాలుద్దీన్, శేఖర్, లక్‌పతినాయక్, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు పరుశరాములు, శ్రీను తదితరులు ఉన్నారు.

● తాడూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలతోపాటు అన్ని విద్యాసంస్థలన్నింటినీ బంద్ పాటించడం జరిగిందని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు మారేడు శివశంకర్ అన్నారు. నీట్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం విద్యా సంస్థల పట్ల తీసుకున్నర నిర్లక్ష్య పోకడల వల్ల చదువుకునే విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని అసహనం వ్యక్తం చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి కురుమూర్తి, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, ఏఐవైఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

● తిమ్మాజిపేట: తిమ్మాజిపేట మండల కేంద్రంలో ఎన్‌ఎస్‌యూఐ మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యా సంస్థల బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌యూఐ నాయకులు ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల వద్దకు వెళ్లి తరగతులను బహిష్కరింపజేశారు. నీట్ పరీక్ష అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలని అన్నారు. అంతకు ముందు జీహెచ్‌ఎం సత్యనారాయణ శెట్టి తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేస్తూ బంద్‌కు సహకరించాలని వారు కోరారు. ఎన్‌ఎస్‌యూఐ నాయకులు సాయి, ప్రశాంత్, పీటర్, శివ, యశ్వంత్ పాల్గొన్నారు.

● పెద్దకొత్తపల్లి: మండలంలో శుక్రవారం బంద్ సంపూర్ణంగా జరిగింది. పెద్దకొత్తపల్లి, దేవునితిర్మలాపూర్ తదితర గ్రామాల్లో ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలను మూసి వేశారు. ఏఐఎస్‌ఎఫ్ ఉమ్మడి పాలమూరు జిల్లా మాజీ అధ్యక్షుడు బొలెద్దుల శ్రీనివాసులు, ఎస్‌ఎఫ్‌ఐ మండల అధ్యక్షుడు శివకుమార్, ఎన్‌ఎస్‌యూఐ మాజీ అధ్యక్షుడు పి.కృష్ణ పాల్గొన్నారు.

● పెంట్లవెల్లి: నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ కొల్లాపూర్ డివిజన్ అధ్యక్షుడు తరుణ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని జట ప్రోల్, గోప్లాపూర్ గ్రామాల్లోని పాఠశాలలను ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన నీట్ పరీక్షను తక్షణమే ఆపేయాలని వారు పేర్కొన్నారు. ప్రజాసంఘాల నాయకులు బత్తిని రాజు, సీపీఎం నాయకులు సురేందర్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు శివ, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

● కొల్లాపూర్: పట్టణ కేంద్రంలోని అన్ని మండలాల గ్రామాల్లోని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు ఎస్‌ఎఫ్‌ఐ కొల్లాపూర్ డివిజన్ కమిటీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో గురువారం భారత్‌బంద్‌ను విజయవంతమైందని ఎస్‌ఎఫ్‌ఐ కొల్లాపూర్ డివిజన్ కార్యదర్శి శివకుమార్ అన్నారు. ప్రజా సంఘాల నాయకులు కేవీపీఎస్ బత్తిని రాజు, సీపీఎం నాయకులు జల్లాపురం సురేందర్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు శివ, కార్తీక్, మంజునాథ్, కార్తీక్, బన్నీ, శివ, పవన్, సింహాద్రి తదితర నాయకులు పాల్గొన్నారు.

● ఊర్కొండ: నీట్ పరీక్ష ను రద్దు చేసి తిరిగి నిర్వహించాలని ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు ఎండి కైసర్ అన్నారు. ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం మండలంలోని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలను ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. నాయకులు అమ్ము, ఇంతియాజ్, గౌస్, జహీర్, సోహెల్, మహమూద్ రియాజోద్దీన్ ఉన్నారు.



విద్యా సంస్థల బంద్‌లో పాల్గొన్న వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు

రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య

- కలెక్టర్ బదావత్ సంతోష్



దొడ్డి కొమరయ్య చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య అని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. కలెక్టరేట్ ఆవరణలో దొడ్డి కొమరయ్య వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ బదావత్ సంతోష్ జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రభుత్వం నుంచి బడుగు బలహీన వర్గాలకు అన్ని విధాలా సహాయసహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు.

● సరైన నివేదిక ఇవ్వాలి.

జిల్లాలో గతంలో గుర్తించిన ఇసుక రీచ్‌లను జిల్లా స్థాయి కమిటీ సభ్యులు మరోసారి సందర్శించి సరైన నివేదికలను ఇవ్వాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ అధ్యక్షతన జరిగిన జిల్లా స్థాయి అధికారుల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అవసరాలకై గతంలో గుర్తించిన ఇసుక రీచ్‌లను పునఃసందర్శించి పూర్తిస్థాయి నివేదికలను అందజేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఉన్న రీచ్‌ల లోటుపాట్లు తదితర వివరాలను అధికారులతో అడిగి తెలుసుకున్నారు. మైన్స్ ఏడీ రవీందర్, జిల్లా భూగర్భ జిల్లా అధికారిణి రమాదేవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మురళి, డీపీవో కృష్ణ, టీఎస్‌ఎండీసీ ప్రాజెక్టు ఆఫీసర్ రాంప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాములు పాల్గొన్నారు.

● కలెక్టరేట్‌లోని కార్యాలయాల పరిశీలన

కలెక్టర్ బదావత్ సంతోష్ గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మొదటి, రెండవ అంతస్తులో గల వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఒక్కో శాఖ వారీగా అధికారులు, సిబ్బంది హాజరును పరిశీలించారు. నిర్దేశిత సమయానికి కొంతమంది ఉద్యోగులు మాత్రమే హాజరవ్వడంతో అసహనం వ్యక్తం చేసిన కలెక్టర్ రేపటి నుంచి అందరూ ఉద్యోగులు సమయానికి హాజరవ్వాలని ఆదేశించారు.

అనధికారికంగా కార్యాలయాలకు సిబ్బంది గైర్హాజరైతే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

దొడ్డి కొమరయ్యకు ఘన నివాళి

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 4: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య వర్ధంతిని గురువారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన దొడ్డి కొమరయ్య చిత్ర పటానికి ఆ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాళ్ల నిరంజన్ పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు బూరుగుపల్లి కృష్ణయాదవ్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభం మల్లేష్‌గౌడ్, నాయకులు వెంకటేశ్వర్లు, సుధాకర్‌గౌడ్, నిరంజన్‌యాదవ్, నేష లక్ష్మయ్య, కుంభం రామకృష్ణగౌడ్, కొత్త శ్రీనివాసులు, అవుట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దొడ్డి కొమరయ్య ఆశయాలను కొనసాగిస్తాం

దొడ్డి కొమరయ్య ఆశయాలను కొసాగిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు అన్నారు. గురువారం దొడ్డి కొమరయ్య వర్ధంతి సందర్భంగా సీపీఎం కార్యాలయంలో కొమరయ్య చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. సీపీఎం నాయకులు కందికొండ గీత, అశోక్, శివవర్మ, దశరథనాయక్, కాశన్న, మధు, నవీన్, సత్యనారాయణ పాల్గొన్నారు.

సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలి

ఊర్కొండ, జూలై 4: సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలని మండల ప్రత్యేక అధికారి సంతోష్ రావు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీపీ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టిన జిల్లా ఆడిట్ అధికారి సంతోష్ రావు పంచాయతీ కార్యదర్శులతో సమావేశం అయి పలు విషయాలపై చర్చించారు. ఎంపీడీవో విజయ్ కుమార్, ఎంపీవో వెంకటేశ్వర్లు పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

బాసర ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక

తెలకపల్లి, జూలై 4 : 2023-24 విద్యా సంవత్సరంలో గౌరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి ఇంగ్లీష్ మీడియం చదివిన ఏ.ఉదయ్‌కుమార్, కే.లాల్‌కుమార్‌లు బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్‌రెడ్డి తెలిపారు. వారిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం.శివప్రసాద్, ఉపాధ్యాయ బృందం అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

మొక్కలు నాటి పరిరక్షించాలి

కల్వకుర్తిటౌన్, జూలై 4 : మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని ఆజాద్ చంద్రశేఖ్ శాఖ సభ్యులు అన్నారు. గురువారం పట్టణంలోని బీఎస్‌ఎన్‌ఎల్ గ్రౌండ్‌లో మొక్కలునాటి మాట్లాడారు. ఆజాద్ చంద్రశేఖర్ శాఖ సభ్యులు వివేకానంద, నర్సింహ, శ్రీనివాస్, నరేష్‌గౌడు, మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తులు పంపిణీ

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 4: మంతటి మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో గురువారం ఉచిత స్కూల్ యూనిఫాం అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు కందూరి భాగ్యలక్ష్మి మాట్లాడారు. ఉపాధ్యాయురాలు దీపిక, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సన్మానం

పెద్దకొత్తపల్లి, జూలై 4 : మండల పరిధిలోని దేవునితిర్మలాపూర్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేసిన ఉపాధ్యాయులు ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్తుండడంతో ప్రజాప్రతినిధులు, తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. దేవునితిర్మలాపూర్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేసిన సందీప్‌రావు, లక్ష్మయ్య, వెంకట్‌రెడ్డి, రజియాబేగం, శ్రీదేవిలు ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్తుండడంతో ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు పూల మాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. గ్రామ సర్పంచ్ వి.సత్యం, ఎంపీటీసీ ప్రతాప్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, రాజయ్య, సుధాకర్ తదితరులు ఉన్నారు.

కల్వకుర్తి మండల పరిషత్ ప్రత్యేక అధికారిగా ఆర్డీవో శ్రీను



కల్వకుర్తి ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరిస్తున్న ఆర్డీవో ఎస్.శ్రీను

కల్వకుర్తి, జూలై 4 : కల్వకుర్తి మండల పరిషత్ ప్రత్యేక అధికారిగా ఆర్డీవో ఎస్.శ్రీను గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీపీ పదవీ కాలం ముగియడంతో కలెక్టర్ కల్వకుర్తి మండల పరిషత్ ప్రత్యేక అధికారిగా ఆర్డీవో శ్రీనును నియమించారు. దీంతో ఆయన మండల ప్రత్యేక అధికారిగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో శ్రీనును పూల మాలలు, శాలువాతో ఎంపీడీవో ఎస్.వెంకట్రాములు, ఎంపీవో దేవేందర్, జూనియర్ అసిస్టెంట్ రమేష్‌లు సత్కరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

మండల ప్రత్యేక అధికారిగా ఆర్డీవో బాధ్యతలు



బాధ్యతలు చేపడుతున్న ఆర్డీవో నాగరాజు

కొల్లాపూర్, జూలై 4 : కొల్లాపూర్ మండల ప్రజా పరిషత్ అధ్యక్ష పదవీ కాల పరిమితి బుధవారం ముగియడంతో గురువారం నుంచి మండల ప్రజా పరిషత్ కార్యాలయాలకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. ఈ మేరకు కొల్లాపూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి ప్రత్యేక అధికారిగా జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంపీడీవో పట్టాభి రామారావు నుంచి ఆర్డీవో నాగరాజు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కార్యాలయ అధికారులు ప్రత్యేక అధికారి ఆర్డీవో నాగరాజును శాలువా, పూల మాలలతో సన్మానించారు. ఎంపీడీవో పట్టాభి రామారావు, ఎంపీవో మనోహర్, కార్యాలయ ఉద్యోగి ఈశ్వరయ్య పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ప్రత్యేకాధికారి

వెల్దండ, జూలై 4 : మండల ప్రత్యేకాధికారిగా గురువారం ఖాజా నజీం అలీ బాధ్యతలు చేపట్టారు. జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారిగా ఉన్న నజీం అలీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సత్యపాల్‌రెడ్డి, మండల సిబ్బంది ఆయనను శాలువాలతో సన్మానించారు.

దివ్యాంగులకు చేయూతగా నిలుద్దాం

కల్వకుర్తి, జూలై 4 : దివ్యాంగులకు చేయూతగా నిలుద్దామని జిల్లెల గ్రామ మాజీ సర్పచ్ జిల్లెల రాములు అన్నారు. మండల పరిధిలోని జిల్లెల గ్రామానికి చెందిన అంగ వైకల్యంతో బాధపడుతున్న బాలుడు కుషాల్‌కుమార్‌గౌడ్‌కు జిల్లెల రాములు వ్యక్తిగతంగా వీల్‌చైర్‌ను గురువారం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లాప్రధాన కార్యదర్శి రమేష్‌నాయక్, గ్రామ హనుమాన్ దేవాలయ చైర్మన్ కే రవిగౌడ్, వైస్ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు ముచ్చర్ల శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు రవి, రంగారెడ్డి, రామకృష్ణ, సుల్తాన్, బాలరాజు, నరసింహ, సత్యనారాయణ, రాము, శ్రీను, పవన్, సత్తేల్, గోపాల్, శ్రీశైలం, పరుశరాములు, వెంకటయ్య, శివ,కోటయ్య తదితరులు ఉన్నారు.

బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేసిన డీటీడీవో

అమ్రాబాద్ జూలై 4: పదర మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గిరిజన వసతి గృహాన్ని డీటీడీవో కమలాకర్ రెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వసతి గృహంలోని విద్యార్థినులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఆయన సూచించారు. వసతి గృహం సంక్షేమ అధికారి తిరుపతమ్మ ఉన్నారు.

రేపు ఎప్‌సెట్ ధ్రువపత్రాల పరిశీలన

బిజినేపల్లి, జూలై 4 : ఇంజనీరింగ్ కళాశాలల్లో సీట్ల భర్తీకి ఎప్‌సెట్ ధ్రువపత్రాల పరిశీలన కౌన్సిల్ ప్రక్రియ ఈనెల 6న నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఎప్‌సెట్ జిల్లా కోఆర్డినేటర్, ఎస్వీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విద్యారాణి గురువారం తెలిపారు. మండలంలోని పాలెంలోని శ్రీవెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ ఆర్ట్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహించే ధ్రువపత్రాల పరిశీలనకు వచ్చే అభ్యర్థులు ఆన్‌లైన్‌లో స్లాట్ బుకింగ్ చేసుకొని కేటాయించిన సమయంలో ఒరిజినల్ సర్టిఫికేట్స్‌తో పాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని సూచించారు.

శేరిఅప్పారెడ్డిపల్లి వాసికి డాక్టరేట్



డాక్టరేట్ పట్టా అందుకుంటున్న రాంచందర్

చారకొండ, జూలై 4: మండల పరిధిలోని శేరిఅప్పారెడ్డిపల్లికి చెందిన ఉపాధ్యాయుడు, కవి మల్లెకేడి రాంచందర్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా పొందాడు. మహాశేతాదేవి- కేశవరెడ్డి నవలల్లో జరిగిన జీవన చిత్రణ అనే అంశంపై డాక్టర్ కె. చంద్రశేఖర్‌రావు పర్యవేక్షణలో పరిశోధన చేసినందుకుగాను ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రకటించింది. ఈ సందర్భంగా డాక్టర్ బి. రాజరత్నం, ప్రొఫెసర్ సి. కాశీం, డాక్టర్ చావ్వా వెంకట్‌రెడ్డి, డాక్టర్ సిల్మానాయక్, డాక్టర్ చంద్రశేఖర్‌రావు, డాక్టర్ జగన్నాధరావు, డాక్టర్ బండారి ప్రేమ కుమార్, బంధుమిత్రులు రాంచందర్‌ను అభినందించారు.

'ప్రజాసేవకు పదవులతో పనిలేదు'

బిజినేపల్లి, జూలై 4 : ప్రజా సేవ చేయాలనే సంకల్పం ఉంటే పదవులతో పనిలేదని ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశపు హాల్‌లో గురువారం ఎంపీడీవో కతాలప్ప అధ్యక్షతన ఎంపీటీసీ సభ్యుల ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించి మాట్లాడారు. అనంతరం ఎంపీపీ, వైస్ ఎంపీపీ, 19 మంది ఎంపీటీసీ సభ్యులను అధికారులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. మండల ప్రత్యేక అధికారి జిల్లా భూగర్భ జల శాఖ అధికారి రమాదేవి, తహసీల్దార్ శ్రీరాములు, ఎంపీవో రాములు నాయక్, ఏవో నీతి రెడ్డి, వైస్ ఎంపీపీ చిన్నారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు సుహాసన్ రెడ్డి, ఆంజనేయులు, బత్తిని తిరుపతి రెడ్డి, రాధా తిరుపతి రెడ్డి, సోములమ్మ, రఘుమారెడ్డి, చీర్లం బాలస్వామి, నాగమ్మ మల్లేష్, ఈర్ల సరోజమ్మ, వేముల తిరుపతయ్య, చంద్రలేఖ, శ్రీశైలం, దేవేంద్రమ్మ, లక్ష్మి గోపినాయక్, ఊశన్న, పొట్టల జ్యోతి తదితరులు ఉన్నారు.

దళితుల సమస్యలు పరిష్కరించాలి

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 4: జిల్లాలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ దళిత హక్కుల పోరాట సమితి(డీహెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ బదావత్ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీహెచ్‌పీఎస్ జిల్లా నాయకుడు గోరటి నరేష్ మాట్లాడారు. సురేష్, శివశంకర్, మల్లేష్ పాల్గొన్నారు.